TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

CEO &Chief Editor: Medi Naresh

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 45 ఆదివారం 20-09-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు-8 వేల:2.00/-

## కేజ్రీవాల్‌కు 'సర్' నోటీసులు

### ఆయన కుటుంబ సభ్యులకు కూడా.. ఈసీపై ఆప్ విమర్శలు



న్యూఢిల్లీ:నవ సంఘర్షణ)
ఢిల్లీలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఎన్నికల సంఘం అధికారులు మాజీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, అతని కుటుంబ సభ్యులు నలుగురికి నోటీసులు జారీ చేశారు. న్యూఢిల్లీ-40 అసెంబ్లీ నియోజకవర్గ ఓటరైన కేజ్రీవాల్, అతని భార్య, కుమారుడు, తల్లిదండ్రులకు నోటీసులు జారీ చేయడం పట్ల ఆమ్ ఆద్మీ పార్టీ విస్మయం వ్యక్తం చేసింది. ఈ దేశంలో జరుగుతున్నదంతా పరమేశ్వరుడిని సంతోషపెట్టడానికేనా? మూడుసార్లు ఢిల్లీకి సీఎంగా పనిచేసిన కేజ్రీవాల్‌తో పాటు, అతని కుటుంబ సభ్యుల ఓట్లు గల్లంతు కావడం ఎలా సాధ్యం' అని పేర్కొన్నది. కాగా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు సైతం నోటీసులు జారీ చేసినట్టు ఈసీ తెలిపింది. ఓటరు జాబితాలో ఆమె పేరులో తేడా కన్పించడంతో నోటీసులు పంపినట్టు తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమైన సర్ ప్రక్రియ తర్వాత 1.45 కోట్లు ఉండే ఢిల్లీ ఓటర్లను 97.5 లక్షలకు తగ్గిస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. తొలగింపునకు గురైన వారు ఈనెల 30 లోగా తమ అభ్యంతరాలు తెలుపుతూ దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొనగా, స్వల్ప సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

# కెరీర్ క్లోజనుకున్నా!

- మా నిపుణ ఏజెంట్లు చైనాకు చిక్కారు
- 15 రోజులైనా ఆచూకీ లభించలేదు
- ఆ సందర్భంలో చాలా ఆందోళన చెందాను
- పాత జ్ఞాపకాలు గుర్తుచేసిన దోవల్
- అద్భుత భవిష్యత్ వైపు భారత్ పరుగులు
- యువతకు శ్రీరాముడే స్ఫూర్తి
- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ప్రసంగం

గూఢచర్య మిషన్లలో ప్రతి అడుగు సవాళ్లతో కూడుకున్నదేనని భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ అన్నారు. తన కెరీర్ ప్రారంభంలో చైనా సైన్యం తమ బృందాన్ని పట్టుకోవడంతో ఉద్యోగ జీవితం ముగిసిపోయిందని భావించిన ఓ ఘటనను ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో విద్యార్థులతో పంచుకున్నారు. ఆ అనుభవం తనకు జీవితాంతం ఉపయోగపడే కీలక పాఠాన్ని నేర్పిందని తెలిపారు. యువత శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



02

## భూటాన్‌లో భూకంపం



02

- ఈశాన్య భూటాన్‌లో ప్రకంపనలు.. అసోంలోనూ ప్రభావం
- సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించినట్లు ఎన్‌సీఎస్ వెల్లడి
- గ్యెల్పోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం
- 5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించిన అధికారులు
- సరిహద్దు అసోంలోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపింపు
- భూటాన్, అసోంలో ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడి
- మూడు రోజుల క్రితం నేపాల్‌లోనూ 4.5 తీవ్రతతో భూకంపం

# స్కూళ్లు తెరిచిన రోజే యూనిఫాం

### మరింత ఆకర్షణీయమైన రంగులలో ఉండాలి

- వైవిధ్యమైన డిజైన్లతో తయారుచేయాలి
- వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే కార్యచరణ ప్రణాళిక
- సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం రేవంత్రెడ్డి మార్గనిర్దేశం
- నెలాఖరులోగా మరో జత యూనిఫాం పంపిణీ చేస్తామని అధికారుల నివేదన

వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే విద్యార్థుల చేతుల్లో యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రి ఉండేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే యూనిఫాంలు ప్రస్తుతం ఉన్న వాటికంటే మరింత ఆకర్షణీయమైన రంగులు, వైవిధ్యమైన డిజైన్లతో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనంగా 10 శాతం మంది విద్యార్థులు చేరే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా యూనిఫాంలు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించిన యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీపై శనివారం అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

02



## నేడే కొడంగల్ (కోస్గి) పాంచజన్య సంకల్ప సభ

### సబ్బండ వర్గాలు సకల జనుల వికాసం, సాధికారత తో కూడిన బహుజన తెలంగాణ సాధనకు బ్లూ ప్రింట్ ప్రకటించనున్న పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత




హైదరాబాద్ )సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)
నేడే 20 సెప్టెంబర్ 2026 (ఆదివారం) కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో తెలంగాణ రక్షణ సేన పాంచజన్య సంకల్ప సభ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఏర్పాటు తర్వాత రెండోసారి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పర్యటించనున్న పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత గారు మే 8న షాద్ నగర్ సమీపంలోని చౌదరిగూడెం లో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ నిర్వహించిన కల్వకుంట్ల కవిత గారు రాజకీయ పార్టీ స్థాపించి కృష్ణా జలాల్లో తెలంగాణకు, ఉమ్మడి పాలమూరు జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై గొంతెత్తిన కల్వకుంట్ల కవిత గారు జోగులాంబ అమ్మవారు ఆశీస్సులతో రాజకీయంగా మొదటి అడుగు వేసిన కల్వకుంట్ల కవిత గారు బహుజన తెలంగాణ సాధన కోసం ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ వేదికగా పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు .కోస్గి కాలేజీ గ్రౌండ్ లో నేడే ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు పాంచజన్య సంకల్ప సభ ప్రారంభమవుతుంది 2009లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి పాలమూరు గడ్డ ఊపిరినిచ్చింది .. ఆ రోజు కల్వకుంట్ల కవిత గారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి తెలంగాణ ఉద్యమ దీపాన్ని వెలిగించాలని ప్రజలకు అప్పీల్ చేశారు.. ప్రజలు తెలంగాణ ఉద్యమ నాయకత్వాన్ని ఆశీర్వదించి ఢిల్లీకి పంపితే దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాలు, సకల జనులకు ఆశించిన స్థాయిలో అభివృద్ధి ఫలాలు అందలేదు.. ఆర్థిక అసమానతలు మరింతగా పెరిగాయి.. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాల దోపిడీని మరింత యథేచ్ఛగా కొనసాగిస్తోంది.. ఈ పరిస్థితుల్లో బహుజన తెలంగాణ సాధన ద్వారా సబ్బండ వర్గాలు, సకల జనుల వికాసం సాధికారత సాధించాలనే లక్ష్యంతో కవిత అడుగులు వేస్తున్నారు పాలమూరు జిల్లా నుంచి గెలిచి రాష్ట్ర పాలన సాగిస్తున్నా ఈ గడ్డకు వచ్చిన ప్రయోజనం ఏమీ లేదు.. ఇదే విషయాన్ని పాలమూరు గడ్డ మీది నుంచి.. కొడంగల్ అడ్డా మీది నుంచి ప్రజలకు చాటి చెప్పేందుకు కవిత గారు ఇక్కడికి వస్తున్నారు...



02

## మనం అత్యంత విధ్వంసకర శక్తిగా మారాలి

- సైన్యానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఆదేశం..!
- మూడు రోజుల పాటు కీలక ఆయుధ కర్మాగారాల్లో కిమ్ పర్యటన
- యుద్ధాన్ని నిరోధించడం, పోరాడటం.. ఆర్టిలరీకి రెండు బాధ్యతలని వెల్లడి
- ఆయుధ తయారీలో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని ఆదేశం
- ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై దృష్టి
- రాకెట్ లాంచర్లు, డ్రోన్ కర్మాగారాలను సందర్శించిన కిమ్
- అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ ని విన్యాసాలకు ఉత్తర కొరియా ప్రతిస్పందన



02

## కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం..

- భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!
- రష్యా, ఇరాన్‌పై ఆంక్షల బిల్లుకు ట్రంప్ ఆమోదం
- రష్యా చమురు కొనుగోలుదారులపై సుంకాలకు అధ్యక్షుడికి అధికారం
- భారత్, చైనాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం
- రష్యా చమురు, గ్యాస్ కొనుగోళ్లపై ఒత్తిడి పెంచేలా చట్టం
- 'షాడో ఫ్లీట్' నౌకలపైనా ఆంక్షలు విధించే అధికారం
- భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం ఉంటుందని భారత్ హెచ్చరిక



## సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

- హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పిటిషన్
- రేపు విచారణకు వచ్చే ఛాన్స్

02







# భూటాన్‌లో భూకంపం..

**-ఈశాన్య భూటాన్‌లో ప్రకంపనలు.. అసోంలోనూ ప్రభావం**
**-సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించినట్లు ఎన్‌సీఎస్ వెల్లడి**
**-గ్యెల్ఫోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం**
**-5 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించిన అధికారులు**
**-ఈశాన్య భూటాన్‌లో పలు ప్రాంతాల్లో ప్రకంపనలు**
**-సరిహద్దు అసోంలోని కొన్ని ప్రాంతాల్లోనూ భూమి కంపింపు**
**-భూటాన్, అసోంలో ఎలాంటి నష్టం జరగలేదని వెల్లడి**
**-అధికారులు అప్రమత్తంగా ఉన్నారని భూటాన్ ప్రభుత్వ వర్గాల సమాచారం**
**-మూడు రోజుల క్రితం నేపాల్‌లోనూ 4.5 తీవ్రతతో భూకంపం**



ఢిల్లీ: భూటాన్‌లో శనివారం భూకంపం సంభవించింది. 4.9 తీవ్రతతో భూమి కంపించింది. భూకంపాల తీవ్రతను కొలిచే నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) ఈ వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం.. భూటాన్ ఈశాన్య ప్రాంతంలో శనివారం సాయంత్రం 4.01 గంటలకు భూకంపం సంభవించింది. దీని తీవ్రత 4.9గా నమోదైంది.గ్యెల్ఫోలంగ్‌కు 3 కిలోమీటర్ల దూరంలో, 5 కిలోమీటర్ల లోతున ఈ భూకంప కేంద్రం ఉంది. ఈశాన్య భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో ఈ భూకంపం నమోదైంది. అలాగే, సరిహద్దులో ఉన్న అసోంలోనూ కొన్ని ప్రాంతాల్లో ప్రకంపనాలు వచ్చాయి. దీంతో అనేక ప్రాంతాల్లో భూమి కంపించింది. ఇటు భూటాన్‌లోనూ, అటు అసోంలోనూ నష్టానికి సంబంధించి ఎలాంటి వివరాలు నమోదు కాలేదు. ఈ భూకంపానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతానికి తీవ్ర నష్టం నమోదు కాకపోయినప్పటికీ.. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నట్లు భూటాన్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు మూడు రోజుల క్రితం నేపాల్‌లో కూడా మరోసారి భూకంపం నమోదైన సంగతి తెలిసిందే. నేపాల్‌లో తాజాగా 4.5 తీవ్రతతో భూకంపం నమోదు కాగా.. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు

# స్కూళ్లు తెరిచిన రోజే యూనిఫాం

**-మరింత ఆకర్షణీయమైన రంగులలో ఉండాలి**
**- వైవిధ్యమైన డిజైన్లతో తయారుచేయాలి**
**- వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక**
**-సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం రేవంత్రెడ్డి మార్గనిర్దేశం**
**- నెలాఖరులోగా మరో జత యూనిఫాం పంపిణీ చేస్తామని అధికారుల నివేదన**



/హైదరాబాద్
విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యం కోసం ప్రయత్నించాలని సీఎం అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీతో పాటు ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్లు పంపిణీ పూర్తి చేశామని సీఎంకు అధికారులు వివరించారు.

వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం

వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం రేవంత్రెడ్డి సూచించారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని సీఎం అన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శృతి ఓజా, సైదులు, సంతోష్, సీతాలక్ష్మి పాల్గొన్నారు.

# స్టార్టప్‌లే భారత యువత సత్తాకు నిదర్శనం..!

మొదటి తరువాయి

ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికిపైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచిందన్నారు. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని చెప్పారు. ఇది భారతదేశ నూతన ఆర్థికవ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా స్టార్టప్‌ల స్థాపనలో కీలకపాత్ర పోషిస్తున్నారని చూపిస్తోందని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ తమతోపాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. ఈ లక్ష్యంతోనే సుమారు రూ.1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించామని చెప్పారు. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుందన్నారు. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ.15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతోపాటు కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయని మోదీ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. మీరు మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలని ప్రధాని అన్నారు. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ప్రధాని అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి' ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐగాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరేవారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని చెప్పారు.

# కెరీర్ క్లోజనుకున్నా!

**- మా నిపుణ ఏజెంట్లు చైనాకు చిక్కారు**
**- 15 రోజులైనా ఆచూకీ లభించలేదు**
**- ఆ సందర్భంలో చాలా ఆందోళన చెందాను**
**- పాత జ్ఞాపకాలు గుర్తుచేసిన దోవల్**
**- అద్భుత భవిష్యత్ వైపు భారత్ పరుగులు**
**- యువతకు శ్రీరాముడే స్ఫూర్తి**
**- ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో ప్రసంగం**

ఢిల్లీ:
గూఢచర్య మిషన్లలో ఎన్నో సవాళ్లు ఎదురవుతుంటాయని, ప్రతీ నిమిషం గండమేనని భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ పేర్కొన్నారు. తన కెరీర్ ప్రారంభ దశలో ఎదురైన ఓ అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చైనా సైన్యం తమ బృందాన్ని పట్టుకోవడంతో తన కెరీర్ ఇక ముగిసిపోయిందని భావించానని తెలిపారు. అయితే, ఆ ఘటన తనకు జీవితాంతం ఉపయోగపడే ఓ ముఖ్యమైన పాఠాన్ని నేర్పించిందని చెప్పారు. శనివారం ఉత్తరాఖండ్ లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తన ఉద్యోగ జీవితం ప్రారంభంలో ఎదురైన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. సిక్కింలో ఉద్యోగం చేస్తున్న సమయంలో అక్కడ మౌంటైన్ గైడ్ గా పనిచేస్తున్న వ్యక్తి నుంచి మూడు విజయ సూత్రాలను నేర్చుకున్నట్లు చెప్పారు. మనం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకోవడం మొదటి సూత్రం. ఎక్కడికి వెళ్లాలో తెలుసుకోవడం రెండోది.



అక్కడికి వెళ్లి తిరిగి ఎలా రావాలో తెలుసుకోవడం మూడోది. ఈ మూడు సూత్రాలూ.. విజయానికి చక్కటి మార్గాలని దోవల్ తెలిపారు. తాను 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు సిక్కింలో ఇంటెలిజెన్స్ బాధ్యతలు నిర్వహించానని, ఆ సమయంలో సిక్కిం భారత్ లో విలీనం అవుతున్న దశలో ఉందని, సరిహద్దు ప్రాంతాల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కదలికలు, కార్యకలాపాలపై సమాచారం సేకరించడం తన బాధ్యతల్లో భాగమని చెప్పారు.

15 రోజులైనా తిరిగిరాని బృందం

ఓసారి సరిహద్దు ప్రాంతానికి సమాచార సేకరణ కోసం తన బృందం వెళ్లింది. ఎనిమిది రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, 15 రోజులైనా ఎలాంటి సమాచారం అందలేదు. వారు బతికే ఉన్నారా? ఏం జరిగింది? అనే ఆందోళన నన్ను తీవ్రంగా వేధించింది. ప్రకృతి విపత్తు లమీ లేనందున, వారి పరిస్థితి ఏమిటన్నది మరింత ఆందోళనకరంగా మారింది. తన బృందాన్ని చైనా సైన్యం పట్టుకుందని ఓ రోజు ప్రధాన కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందింది. కొన్ని రోజుల తర్వాత వారు తిరిగి వచ్చినప్పటికీ, తీవ్రంగా కుంగిపోయిన పరిస్థితిలో ఉన్నారని దోవల్ గుర్తుచేసుకున్నారు.

కెరీర్ ముగిసిపోయిందనుకున్నా..

ఈ ఘటనపై విచారణ ప్రారంభం కావడంతో తన కెరీర్ ముగిసిపోయిందని భావించినట్లు దోవల్ తెలిపారు. తాను వృత్తిపరంగా పెద్ద తప్పు చేశానని భావించినట్లు వివరించారు. అయితే విచారణలో తన తప్పు లేదని తేలింది. ఈ బృందానికి అందించిన మ్యాప్లు, స్కెచ్లలో తప్పులు ఉన్నట్లు కమిటీ గుర్తించింది. దీంతో నాకు క్లీన్‌చిట్ లభించింది. అయినప్పటికీ ఆ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని దోవల్ చెప్పారు. ఆ సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరోలో తనతో పనిచేసిన ఓ టిబెటన్ షెర్పా చెప్పిన మాటలు తనకు ఎంతో ధైర్యాన్నిచ్చాయని దోవల్ తెలిపారు.

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి..

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు అజిత్ దోవల్ పిలుపునిచ్చారు. రాముడి ధైర్యసాహసాల వల్లే విశ్వామిత్రుడు రాక్షస సంహారానికి ఆయన్ని ఎంచుకున్నారని వివరించారు. భారత్ లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, అద్భుతమైన భవిష్యత్ దిశగా భారత్ పరుగులు తీస్తోందని చెప్పారు. ప్రధాని మోడీ చెప్పినట్లుగా భారత్ కు 2047 వరకు అమృత్ కాలమని అన్నారు. ప్రస్తుతం 4.015 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రానున్న 20 ఏళ్లలో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు.

# 22ఏ సమస్యలకు త్వరలో పరిష్కారం

మొదటి తరువాయి

44 కాలనీల్లో ఇండ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలను శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఆధార్ తరహాలో భూదార్ కార్డులు అందించనున్నట్టు చెప్పారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 64 కాలనీలకు 44 కాలనీల సమస్యలను పరిష్కరిం చామని తెలిపారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులు ఉన్నప్పటికీ నెల రోజుల్లోగా సమస్యలను పరిష్కరించి ఇండ్లను క్రమబద్ధీకరిస్తామని, ఎవరూ ఇండ్లు కూల్చాల్సిన పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. జీవో 118 ద్వారా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని మరికొంత మంది సమస్యలను కూడా నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే నిర్వహించి భూముల సరిహద్దులను డిజిటల్ మ్యాపింగ్ ద్వారా నమోదు చేసి ప్రతి భూమికీ భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.22ఏ సమస్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే ఉందని, దానిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని లేఅవుట్లలోని కొన్ని ప్లాట్లు కూడా 22ఏ జాబితాలో చేరాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ప్రకటించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జీవో 118 జారీ చేయలేదని, పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం ప్రజల హక్కులను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ప్లాట్ యజమానికీ పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలోని చిక్కులను తొలగించేందుకు 44 కాలనీల కోసం జీవో 118 తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో భూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కాలనీల్లో బస్సు సౌకర్యం అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన చోట ఆర్టీసీ బస్సులు నడిపిస్తామని అన్నారు.

# కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడి సంతకం..

**భారత్, చైనాలపై సుంకాలకు ట్రంప్‌కు ఫుల్ పవర్..!**
**రష్యా, ఇరాన్‌పై ఆంక్షల బిల్లుకు ట్రంప్ ఆమోదం**
**రష్యా చమురు కొనుగోలుదారులపై సుంకాలకు అధ్యక్షుడికి అధికారం**
**భారత్, చైనాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం**
**రష్యా చమురు, గ్యాస్ కొనుగోళ్లపై ఒత్తిడి పెంచేలా చట్టం**
**'షాడో ఫ్లీట్' నౌకలపైనా ఆంక్షలు విధించే అధికారం**
**భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం ఉంటుందని భారత్ హెచ్చరిక**



రష్యా, ఇరాన్, చైనా, భారత్ లను ఒకేసారి దెబ్బతీసే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దాంతో రష్యా, ఇరాన్ లపై ఆంక్షలను విధించేందుకు, వాటితో వాణిజ్యం కొనసాగిస్తోన్న భారత్, చైనాల పై సుంకాల మోత మోగించేందుకు అధ్యక్షుడికి అధికారం దఖలు పడింది.'ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం-2026' పేరుతో తీసుకొచ్చిన బిల్లుకు బుధవారం సభ 262-159 ఓట్లతో ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును గత నెలలోనే సెనెట్ ఆమోదించింది. ఇప్పుడు ట్రంప్ సంతకం చేయడంతో చట్టరూపం దాల్చింది. దాంతో భారత్ , చైనా తో సహా 10 దేశాలు ఆంక్షల పరిధిలోకి వచ్చాయి. భారత్ అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై ట్రంప్ సర్కార్ భారీగా సుంకాలు విధించనుంది. ఈ చట్టంపై ఇప్పటికే భారత్ స్పందించింది. రష్యాపై ఆంక్షలను, తమపై సుంకాలను విధిస్తే అమెరికాతో ద్వైపాక్షిక సంబంధాలకు ముప్పు తప్పదని భారత్ హెచ్చరించింది. అమెరికా చర్యను చైనా తిరస్కరించింది. భద్రతామండలి ఆమోదంలేని ఏ చర్యనూ ఆమోదించబోమని ఆ దేశ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ స్పష్టంచేశారు. ఈ చట్టంతో ట్రంప్‌నకు మరిన్ని అధికారాలు లభించినట్లయ్యింది. రష్యా నాయకత్వంపై ఆంక్షలు విధించే అవకాశం దక్కింది. ఇంధన రంగంపై ఆంక్షల విధించవచ్చు. ఇప్పటికే ఉన్న ఆంక్షలను తప్పించుకుంటూ చమురు సరఫరాచేసే నౌకల షాడో ఫ్లీట్‌పైనా ఆంక్షలు విధించడానికి అధ్యక్షుడికి అధికారం దక్కుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేలా ఒత్తిడి తెస్తూ భారత్, చైనా వంటి దేశాలపై సుంకాల మోత మోగించే అధికారం ఉంటుంది.

# మనం అత్యంత విధ్వంసకర శక్తిగా మారాలి..

**-సైన్యానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ ఆదేశం..!**
**-మూడు రోజుల పాటు కీలక ఆయుధ కర్మాగారాల్లో కిమ్ పర్యటన**
**-యుద్ధాన్ని నిరోధించడం, పోరాడటం.. ఆర్టిలరీకి రెండు బాధ్యతలని వెల్లడి**
**-ఆయుధ తయారీలో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని ఆదేశం**
**-ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యం పెంపుపై దృష్టి**
**-రాకెట్ లాంచర్లు, డ్రోన్ కర్మాగారాలను సందర్శించిన కిమ్**
**-అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ విన్యాసాలకు ఉత్తర కొరియా ప్రతిస్పందన**
**-డ్రోన్లు, క్రూయిజ్, బాలిస్టిక్ క్షిపణులతో భారీ ఫైర్‌పవర్ విన్యాసం**



ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తమ దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా కీలక ఆదేశాలు జారీచేశారు. తమ ఫిరంగి దళాలు (ఆర్టిలరీ) అత్యంత కేంద్రీకృత, విధ్వంసకర సామర్థ్యాలను కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ వారంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు ఆయన పలు కీలక ఆయుధ కర్మాగారాలను సందర్శించారు. ఈ పర్యటన వివరాలను ఉత్తర కొరియా అధికారిక మీడియా (వీవఎఖు) వెల్లడించింది.కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ)' కథనం ప్రకారం.. రూలింగ్ వర్కర్స్ పార్టీ సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ పాక్ జోంగ్ చోన్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు కిమ్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ.. "యుద్ధాన్ని నిరోధించడం, యుద్ధంలో పోరాడటం అనే రెండు కీలక బాధ్యతలను మన ఆర్టిలరీ సమర్థంగా నిర్వర్తించాలి. దీని కోసం అత్యంత విధ్వంసకర, బహుముఖ దాడి సామర్థ్యాన్ని కలిగి ఉండాలి" అని స్పష్టంచేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యాన్ని నిర్మించాలనే పార్టీ వ్యూహాత్మక విధానంలో ఆయుధ పరిశ్రమ కీలకపాత్ర పోషించాలని కిమ్ ఉద్ఘాటించారు. దాడి, రక్షణ ఆయుధాలలో కృత్రిమ మేధ (ఏఐ) స్థాయిని పెంచడం, ఫిరంగి ఆయుధాల ఆటోమేషన్, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి విధానపరమైన పనులను ఆయన నిర్దేశించారు. కిమ్ 600 ఎంఎం, 240 ఎంఎం మల్టిపుల్ రాకెట్ లాంచర్లు, డ్రోన్‌లను ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలను సందర్శించి ఉండవచ్చని సియోల్‌కు చెందిన కొరియా డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ ఫోరమ్ సెక్రటరీ జనరల్ షిన్ జోంగ్-వూ విశ్లేషించారు. కాగా దక్షిణకొరియా, అమెరికా, జపాన్ దేశాలు ఇటీవల నిర్వహించిన త్రైపాక్షిక సైనిక విన్యాసాలకు ప్రతిస్పందనగా సెప్టెంబర్ 14న ఉత్తర కొరియా క్షిపణి, ఫిరంగి దళాలతో భారీ ఫైర్‌పవర్ విన్యాసాన్ని నిర్వహించింది. ఈ విన్యాసంలో కొత్త రకం అటాక్ డ్రోన్లు, టాక్టికల్ క్రూయిజ్ క్షిపణులు, భారీ కాలిబర్ రాకెట్ లాంచర్లు, టాక్టికల్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించారు. ఈ ఆయుధాలన్నీ తమ లక్ష్యాలను 100 శాతం కచ్చితత్వంతో ఛేదించాయని ఉత్తర కొరియా ప్రకటించుకుంది.

# మహిళపై ఇంత కర్కశత్వమా?

మొదటి తరువాయి

ప్రజలు, రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మాత్రం అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒడిశాకు చెందిన ఓ పేద యువతిని ఎంపీ కొడుకు వాహనంతో ఢీకొట్టి చంపితే పోలీసులు మౌనం వహించారని మండిపడ్డారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల కుటుంబాలకు సంబంధించిన కేసుల్లో ఒక రకంగా, సామాన్య ప్రజలు లేదా రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు.

గూండాలకు పోలీస్ ఎస్కార్టా?

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై దాడి చేయించేందుకు గూండాలను ప్రత్యేక తాళ్ల బృందాలతో పోలీసులు ఎస్కార్ట్ కల్పించారని కేటీఆర్ ఆరోపించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 7న అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, వారి జుట్టు, చీరలు లాగారని గుర్తుచేశారు. తమ పార్టీ నేత మన్నె క్రిశాంక్ అరెస్టు వ్యవహారంలో ఆయన బిడ్డను పాఠశాలకు వెళ్లకుండా అడ్డుకొని భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

చిన్నారులు, మహిళల రక్షణ విషయంలో పోలీసు వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. పోలీసు యూనిఫాం ధరించిన అధికారులు.. ప్రజలు, రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మాత్రం వీధి గూండాలకు ఏమాత్రం తీసిపోని విధంగా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పట్టపగలే హత్యలు జరుగుతున్నా, శాంతిభద్రతలు క్షీణించినా ప్రభుత్వం రాజకీయ అంశాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నియంత్రణపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు.

# సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

**- హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పిటిషన్**
**- రేపు విచారణకు వచ్చే ఛాన్స్**



తెలంగాణ బ్యూరో :
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత అంశంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానం పిటిషన్ రేపు విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లుగా సమాచారం. కాగా, దానం నాగేందర్ అనర్హత అంశంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బిజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సుప్రీంకోర్టులో ముందుస్తుగా కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. దానం పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించినప్పుడు ఈ కేవియట్ పిటిషనర్లకు నోటీసులు ఇవ్వాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు తెలిపారు. దీంతో దానం అనర్హత అంశం మరింత ఆసక్తిగా మారింది.

ఎన్నికల్లో కొట్లాడుతా..

అంతకుముందు శనివారం మధ్యాహ్నం హైకోర్టు తీర్పుపైన దానం నాగేందర్ మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మాట్లాడుతూ.. తాను సుప్రీంకోర్టుకు వెళ్లనని చెప్పారు. శుక్రవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని.. 'నీవు ఫైటర్వి కదా.. ఫైట్ చేద్దాం' అని సీఎం తనకు ధైర్యం చెప్పారని దానం తెలిపారు. తాను ఇప్పటికీ ఫైట్ చేస్తానని స్పష్టత ఇచ్చానని, కోర్టు తీర్పుపైన తాను మీడియాతో మాట్లాడనని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పు ఇచ్చింది స్పీకర్ నిర్ణయంపైన అని, పై కోర్టుకు వెళ్లాలంటే ఆయనే వెళ్లాలని, సుప్రీంకోర్టుకు వెళ్తారో లేదో స్పీకర్ నిర్ణయమని దానం అన్నారు. అయితే ఆ తదనంతరం దానం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడం గమనార్హం.

# మాదిగ సంఘం స్థలానికి నష్టపరిహారం అందించాలి

**-మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లాలని తొట్ల తిరుపతి యాదవ్‌కు వినతి**



**రామగిరి,సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)** శనివారం రామగిరి మండలం బేగంపేట్ క్రాస్ రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్‌ను రత్నాపూర్ మాదిగ సంఘం నాయకులు, మహిళలు కలిసి వినతిపత్రం అందజేశారు. రత్నాపూర్ గ్రామం మేడిపల్లి శివారు ప్రాంతంలోని సర్వే నంబర్లు 135,136లో గల భూమిని కోకాకోలా ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం భూసేకరణ నిమిత్తం తీసుకోవడం జరిగిందని మాదిగ సంఘం నాయకులు తెలిపారు.సర్వే నంబర్లు 135, 136లోని భూమిపై తమ మాదిగ కుల సంఘానికి చెందిన సభ్యులు గత 50 సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతూ వస్తున్నారని తెలిపారు.భూసేకరణ కారణంగా తమ సంఘ సభ్యుల జీవనోపాధికి నష్టం కలుగుతున్నందున తమకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.అసైన్డ్ భూములకు ఏ విధంగా నష్టపరిహారం అందిస్తున్నారో,అదే విధంగా తమ సంఘానికి కేటాయించిన భూమికి కూడా తగిన నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి,తగిన న్యాయం జరిగేలా చూడాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ ను కోరారు.ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ రత్నాపూర్ మాదిగ సంఘం నాయకులు,మహిళలు తెలిపిన సమస్యను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క,కొమురయ్య గౌడ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కండె పోషం,మాజీ జెడ్పీటీసీ మైదం వరప్రసాద్,మట్ట రాజ్‌కుమార్,బర్ల శ్రీకాంత్,భోగే ప్రకాష్,అధ్యక్షులు కండె గట్టయ్య ,ఉపాధ్యక్షులు బెజ్జల రాములు,బెజ్జల సంజీవ్ కొడారి సది,వార్డ్ సభ్యులు కండె సాహితి,కండె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తీదేడులో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**ప్రతి అర్హునికి సంక్షేమ ఫలం అందాలన్నదే ధ్యేయం - సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి**



**చింతపల్లి సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ):** చింతపల్లి మండలం తీదేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన కుటుంబాలకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా మారుతుందని ఆమె తెలిపారు. అంతేకాకుండా, ఈ నూతన స్మార్ట్ కార్డుల వల్ల లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సకాలంలో రేషన్ సరుకులు పొందే అవకాశం కలుగుతుందని, ఒకవేళ అర్హత ఉండి ఇంకా కార్డులు రాని వారు ఉంటే వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో గ్రామ పాలనాధికారి బుషిపాక యాదయ్య, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి, మాదగోని కృష్ణ గౌడ్, దాసరి కళమ్మ ముత్తయ్య, రెడ్డి పద్మ పరమేష్, శివర్ల పర్వతాలు యాదవ్, రేషన్ డీలర్లు బొడ్డు యాదగిరి, ముద్దం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎమ్మెల్యే బాలునాయక్ చొరవతో

# పందిరిగుండుతండాకు తాగునీరు

**సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్, గ్రామస్తులు**





**దేవరకొండ సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)** నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పందిరిగుండుతండా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తక్షణమే పరిష్కరించారు. తాగునీటి సమస్య ఎమ్మెల్యే దృష్టికి రాగానే ఆయన వెంటనే స్పందించి ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు పందిరిగుండుతండాకు చేరుకుని సమీపంలోని పెండ్లిపాకుల రిజర్వాయర్ నుంచి మొండి కట్టల చెరువులో ఏర్పాటు చేసిన బావిలోకి నీటిని తరలించారు. అక్కడి నుంచి బోర్ల సహాయంతో తండాలకు నీటిని సరఫరా చేశారు. దీంతో గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామస్తులకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది.తాగునీటి సమస్యను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారులను రంగంలోకి దించి సమస్యను పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పందిరిగుండుతండా సర్పంచ్, గ్రామస్తులు మాట్లాడుతూ, తమ తాగునీటి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే స్పందించి అధికారులను పంపించి నీటిని అందించారని, తమ దాహార్తిని తీర్చిన ఎమ్మెల్యే బాలునాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంబంధిత అధికారులు మాట్లాడుతూ, పందిరిగుండుతండాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఇకపై సమస్య పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల సమన్వయంతో నీటి సరఫరాను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

# మల్లారెడ్డిపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలం అందడమే లక్ష్యం**

**- సర్పంచ్ సుమిత రఘుమారెడ్డి**



చింతపల్లి సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ): చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గట్రాయినిపాలెంలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుమిత రఘుమారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలని, స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరుగుతుందని తెలిపారు. అర్హత ఉండి ఇంకా కార్డులు రాని వారు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్ పల్లిలో రాజీవ్ సే నా ఆధ్వర్యంలో ఘనంగా అన్నప్రసాద కార్యక్రమం



**మెట్ పల్లి సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)** పట్టణంలోని రాజీవ్ సేనా ఆధ్వర్యంలో శనివారం అ న్నప్రసాద కార్యక్రమాన్ని అ త్యంత ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున హా జరై ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలార పు లింబాద్రి, వైస్ చైర్మన్ న వీన్ ముఖ్య అతిథులుగా వి చ్చేశారు. వీరితో పాటు కౌ న్సిలర్లు బత్తుల నరేష్, మ సూల ప్రవీణ్, తదితర ప్ర ముఖ నాయకులు, రాజీవ్ సేనా యూత్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఇలాంటి సే వా కార్యక్రమాలు సమాజం లో పరస్పర సహకారాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయ ని కొనియాడారు.రాజీవ్ సే నా యువకులు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయ మని ప్రశంసించారు. అనం తరం నిర్వాహకులు అంద రికీ భోజనాలు వడ్డించి, ఆ ప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో స్థానికులు, ప్రయాణికులు పెద్ద సంఖ్య లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# తెలంగాణ బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదములు

**--- ప్యారసాని రమాకాంత్ ప్రచార కార్యదర్శి తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం**




**రవీంద్ర భారతి హైదరాబాద్ )సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)** రవీంద్ర భారతి హైదరాబాదులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వేడుకలకు పొన్నం ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి హాజరై మేదర ఫెడరేషన్ కు పాలక మండలి ఏర్పాటు చేయడానికి మరియు మేదర ఆత్మగౌరవ కుల సంఘ భవనానికి ఆర్థిక వనరులు సమకూర్చుటకు, మరియు మేదరి కుల వృత్తి దారులకు ప్రత్యేకమైన నైపుణ్య శిక్షణ ఇచ్చుటకు తగినన్ని నిధులు కేటాయించడానికి తమ వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీనిచ్చినందుకు తెలంగాణ రాష్ట్రం మేదరి మహేంద్ర సంఘం పక్షాన పారసోని రమాకాంత్ ప్రచార కార్యదర్శి తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ప్రపంచ వెదురు దినోత్సవం వేడుకలు ఘనంగా అంగరంగ వైభవంగా జరగడానికి తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుండి విచ్చేసిన ఆత్మీయ మేదరి బంధువులకు. ఇంత చక్కగా విజయవంతము కావడానికి కృషి చేసిన ఆయా జిల్లాల అధ్యక్షులు కార్యవర్గాలకు మరియు వివిధ అనుబంధ సంఘాల నాయకులందరికి పేరు పేరున తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం పక్షాన ప్యారసాని రమాకాంత్ అభినందనలు ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ క్వాలిఫైడ్ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

**-రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా డా.ఎం.శ్రీశైలం, డా.గడ్డం ఆదాము**

**-అర్హత కలిగిన అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం కోసం కృషికి హామీ**





**హైదరాబాద్,సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)** తెలంగాణ క్వాలిఫైడ్ డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజీ క్యూడీజీఎల్ఏ) నూతన రాష్ట్ర కమిటీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న పీహెచ్‌డీ, నెట్, సెట్ వంటి అర్హతలు కలిగిన అధ్యాపకులు ఈ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. నూతన రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా డా.ఎం.శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా డా.గడ్డం ఆదాము, రాష్ట్ర సమన్వయకర్తగా డా.ఎ.వేణు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా డా.బి.భూపాల్, డా.జె.సంతోష్, కోశాధికారిగా డా.డి.కరుణాకర్, సహాయ కార్యదర్శిగా డా.సోమ కృష్ణయ్యలను నియమించారు. రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా డా.జి.యాకన్న, డా.బి.యాదయ్య, డా.డి.సాయిలు, డా.ఐ.రవీంద్రం, డా.ఎస్.కిషోర్, డా.కే.రమేష్, డా.జె.త్యాగరాజు, డా.బి.శివశంకర్, డా.కే.వెంకన్న, డా.ఎస్.కే.ఉస్మాన్ పాషా, డా.వి.సందీప్, డా.నరసింహ, డా.ఆర్.కృష్ణ నాయక్, పి.సురేష్, డా.ఎం.రాహుల్ తదితరులు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి జిల్లాకు ఒకరి చొప్పున పది మంది అధ్యాపకులను రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీలోకి తీసుకోనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆయా జిల్లాల ప్రతినిధులు తమ జిల్లాలకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ, జిల్లాలోని అతిథి అధ్యాపకులకు మరియు రాష్ట్ర కమిటీకి మధ్య అనుసంధానంగా ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం.శ్రీశైలం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అర్హత కలిగిన అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం(మినిమం టైమ్ స్కేల్–ఎంటిఎస్) అందించాలని రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయపరమైన హక్కుల సాధనకు కృషి చేస్తానని చెప్పారు.

# జేబిసిసిఐ లో పాల్గొనే అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలి

**సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్**



**రామగిరి,సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)** సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ ఆర్జీ త్రీ ఏరియా ఏఎల్పి గని యందు సింగరేణి కార్మికులకు 2025-26 ఆర్థిక సంవత్సరం లో వచ్చిన లాభాల వాట 40% శాతం వెంటనే చెల్లించాలని అలాగే సింగరేణిలో గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల కాల పరిమితి ముగిసిన కారణంగా తదుపరి ఎన్నికలు జరిగే వరకు జేబిసిసిఐ లో పాల్గొనే అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని, అధికారిక కార్యక్రమాలకు జేబిసిసిఐ లో పాల్గొనే అన్ని సంఘాలను పిలవాలని మేనేజర్ కు సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ తరపున మెమోరాండం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ అనుప రమేష్,ఆర్జీ త్రీ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఉప్పుమల్ల వంశీ,ఆర్గనైజింగ్ సెక్రెటరీ గాజువేని తిరుపతి,ఫిట్ సెక్రటరీ మీనుగు సంతోష్,అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కందుల మహేష్,చాట్ల వెంకటేష్,షిఫ్ట్ ఇన్చార్జీలు రాయవేణి రమేష్,వెంకట్ సాయి,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# అంతరిక్ష రణంతో పెనుసంక్షోభం



విశ్వశాంతి కోసం వైజ్ఞానిక ప్రయోగాలకు, శాంతిభద్రతలకు వినియోగించవలసిన అంతరిక్షం, అగ్రరాజ్యాల మధ్య పరస్పర అవిశ్వాసం పెరిగిపోయి ఇప్పుడు సరికొత్త వ్యూహాత్మక యుద్ధ రంగంగా మారుతోంది. ఇప్పటివరకు హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ సినిమాలకే పరిమితమైన 'స్పేస్‌వార్' కాన్సెప్ట్ ఇప్పుడు క్రమంగా వాస్తవ ప్రపంచం లోకి అడుగుపెడుతోంది. భూమి చుట్టూ ఉన్న కక్షలో శత్రుదేశాల (ముఖ్యంగా చైనా, రష్యాలు) వ్యూహాలను చిత్తు చేయడానికి అంతరిక్ష నియంత్రణ ఆయుధాలను (స్పేస్ కంట్రోల్ వెపన్స్) మోహరించినట్టు అమెరికా వైమానిక దళ కార్యదర్శి ట్రాయ్ మీంక్ అధికారికంగా వెల్లడించడం ప్రపంచ దేశాల్లో అలజడి ప్రారంభమైంది. చైనా, రష్యాలు తమ అంతరిక్ష సైనిక సామర్థ్యాలను విస్తరిస్తున్న తరుణంలో అమెరికా ఈ సంచలనాత్మక ప్రకటన చేయడం విశ్వాంతరాళంలో సరికొత్త వ్యూహాత్మక పోరుకు తెరలేపింది. అమెరికా చర్యలను చైనా, రష్యా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ వారు కూడా అంతరిక్షంలో ఇతర దేశాల ఉపగ్రహాలను అడ్డుకునే అత్యాధునిక కౌంటర్ స్పేస్ సాంకేతికతలను, హైపర్ సోనిక్ గ్లైడ్ వాహనాలను వేగంగా అభివృద్ధి చేస్తుండటం గమనార్హం. భారత్ కూడా 2019 లోనే 'మిషన్ శక్తి' ద్వారా ఉపగ్రహ నిరోధక క్షిపణి సామర్థ్యాన్ని నిరూపించుకుని అంతరిక్ష రక్షణ రంగంలో బలమైన శక్తిగా ఎదిగింది. ఈ విధంగా ఏ దేశానికి ఆ దేశం పరస్పర అవిశ్వాసంతో అంతరిక్ష ఆయుధాల పోటీని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. అంతరిక్ష ఆయుధాల దాడివల్ల ఉపగ్రహాలు ధ్వంసం అవుతాయి. ప్రపంచ దేశాల కమ్యూనికేషన్, నావిగేషన్, వాతావరణ అంచనా వ్యవస్థలు, విమానయానం, మొబైల్ సిగ్నల్స్ వ్యవస్థ, జిపిఎస్, బ్యాంకింగ్ లావాదేవీలు తదితర అత్యంత కీలకమైన వ్యవస్థలన్నీ ఉపగ్రహాల ఆధారంగానే పనిచేస్తున్నాయి. ఉపగ్రహాలు ధ్వంసం అయితే భూమిపై పెను సంక్షోభం ఏర్పడుతుంది. అందుకనే అమెరికా అంతరిక్ష నియంత్రణల ఆయుధాల మోహరింపు ప్రకటనపై ప్రపంచం ఆందోళన చెందుతోంది. 1967లో అంతరిక్షం రణక్షేత్రంగా మారకూడదన్న ముందుచూపుతో 'అంతరిక్ష ఒప్పందం' (అవుటర్ స్పేస్ ట్రీటీ) కుదిరింది. ఈ ఒప్పందంపై భారత్, అమెరికా, చైనా, రష్యా (అప్పటి సోవియెట్ యూనియన్) సహా కనీసం 118 దేశాలు సంతకం చేశాయి. ఈ ఒప్పందంలో అణు ఆయుధాలను, ఇతర సామూహిక వినాశన ఆయుధాలను భూకక్షలోకి, చంద్రగోళం పైకి మోహరించకూడదని, ఈ ఖగోళాలపై సైనిక స్థావరాల నిర్మాణం, ఆయుధ పరీక్షలు నిర్వహించడం, ఖనిజాల తవ్వకం వంటి చర్యలేవీ పనికిరావని నిషేధం విధించడమైంది. అయితే ఈ ఒప్పందంలో సంప్రదాయ అంతరిక్ష నియంత్రణ ఆయుధాలు, లేజర్లు, యాంటీ శాటిలైట్ ఆయుధాలు, కక్షలో తిరిగే ఇతర సైనిక పరికరాల గురించి ఎలాంటి ప్రస్తావన కానీ, నిబంధనలు కానీ లేవు. దీన్ని అవకాశంగా తీసుకుని అత్యంత ఆధునిక సాంకేతిక క్షిపణుల వినియోగంతో ఇప్పుడు ఈ ఒప్పందానికి అగ్రదేశాలు తూట్లు పొడుస్తున్నాయి. దీనివల్ల అంతరిక్షంలో ఆయుధ పోటీ ప్రమాదకరంగా పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. చాలా కాలంగా కొన్ని దేశాలకు అంతరిక్షంలో ఆయుధ పోటీకి అవసరమైన సామర్థ్యాలు ఉన్నాయి. 1975 జనవరిలో సోవియెట్ యూనియన్‌కు చెందిన శాల్యూట్ 3 అంతరిక్ష కేంద్రంనుంచి రిమోట్‌గా 20 గుండ్లు పేల్చినట్టు బయటపడింది. 2007లో చైనా, 2019లో భారత్ భూమిపై నుంచి ప్రయోగించిన క్షిపణుల్లో తమకు చెందిన పనికి రాని ఉపగ్రహాలను ధ్వంసం చేశాయి. అయితే ఈ చర్యలేవీ 1967 నాటి అంతరిక్ష ఒప్పందాన్ని ఉల్లంఘించలేదు. చైనా, రష్యా అంతరిక్ష ఆధారిత ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యాలను కూడా అభివృద్ధి చేశాయి. అయినా అంతరిక్షంలో అణ్వాయుధ పోటీ పూర్తి స్థాయిలో ప్రారంభమైనట్టు ఈ విషయాలు నిరూపించవు. అమెరికా అంతరిక్షంలో ఆయుధాలను మోహరించే ప్రణాళిక ఒక్క రాత్రిలో తీసుకున్న నిర్ణయం కాదు. ఈ ప్రక్రియ చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది. 2001 జనవరిలో అప్పటి అమెరికా రక్షణ కార్యదర్శి డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్ నేతృత్వం లోని అమెరికా స్పేస్ కమిషన్ తన స్వప్రయోజనాల కోసం స్వయంగా అంతరిక్ష విధానాన్ని సిఫారసు చేసింది. దీని ప్రకారం అమెరికా ప్రయోజనాలకు ఎదురయ్యే ముప్పును అడ్డుకోవడానికి, అవసరమైతే వాటిపై దాడులను సాగించడానికి వీలుగా అంతరిక్షంలో ఆయుధాలను మోహరించే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడికి కల్పించాలని సూచించింది. 2002లో అమెరికా యాంటీ బాలిస్టిక్ మిసైల్ (ఎబిఎం) ఒప్పందం నుంచి వైదొలగడంతో అంతరిక్ష ఆధారిత క్షిపణి రక్షణ వ్యవస్థలను అభివృద్ధి చేసే అవకాశం అమెరికాకు మరింత పెరిగింది. ఈ ప్రారంభ చర్యలు 2019లో డొనాల్డ్ ట్రంప్ తన మొదటి అధ్యక్ష పదవీ కాలంలో పుంజుకుని అమెరికా స్పేస్ ఫోర్స్ ఏర్పాటుకు దారితీశాయి. అందువల్ల అంతరిక్షంలో ఆయుధాలను మోహరించాలనే ప్రణాళిక గత 25 సంవత్సరాలుగా అమెరికాలో అభివృద్ధి చెందుతోంది. అంతరిక్ష ఆయుధాలు రెండు రకాలుగా ఉంటున్నాయి. కైనెటిక్ ఆయుధాలు అంటే క్షిపణులు ఉపగ్రహాలను ఢీకొట్టి ముక్కలు చేస్తాయి. నాన్ కైనెటిక్ ఆయుధాలైతే లేజర్ కిరణాలతో శత్రు ఉపగ్రహాల సెన్సార్లను విచ్ఛిన్నం చేస్తాయి. సైబర్ దాడులకు పాల్పడడం, సిగ్నల్స్‌ను స్తంభింప చేయడం తదితర విధ్వంసాలు కలిగిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో అంతరిక్షాన్ని శాంతియుత ప్రయోజనాలకే పరిమితం చేసేలా ప్రస్తుత సాంకేతికతకు తగినట్టుగా ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కొత్త అంతర్జాతీయ చట్టాలు, కఠిన నిబంధనలు రూపొందించాల్సిన సమయం ఆసన్నమైంది.

# తెలుగు రాష్ట్రాలకు ఎల్‌నినో ముప్పు



ఎల్‌నినో ప్రభావం వల్ల తెలుగు రాష్ట్రాల్లో దుర్భిక్ష పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. వర్షపాత లోటు ఏర్పడి రైతుల సేద్యం ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడ్డాయి. తెలంగాణలో సెప్టెంబర్ 2026 నాటికి 18 జిల్లాల్లో తీవ్ర వర్షపాత లోటుతో పాటు కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయి. జోగులాంబ గద్వాల్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక దారుణమైన కరువు పరిస్థితిలో ఉంది. సాధారణ వర్షపాతం కంటే చాలా తక్కువ నమోదైంది. వనపర్తి జిల్లాలో 41% వర్షపాత లోటు నమోదైంది. నారాయణపేట్, ఖమ్మం జిల్లాల్లో 37% లోటు వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 38% వర్షపాతం లోటు ఏర్పడింది. సూర్యాపేట, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో 31% నుండి 34% లోటుతో కరువు ఛాయలు కమ్ముకున్నాయి. వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ మధ్య ఒకేసారి భారీ వర్షాలు కురిసినా, ఆ నీరు వృథా అయిందే గాని భూగర్భ జలాల పెరుగుదలకు ఉపయోగపడలేదు.

తెలంగాణలో నేటి కరువు పరిస్థితులకు, పంటల నష్టాలకు గత, నేటి పాలక ప్రభుత్వాలే కారణం. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో, చెరువుల, కుంటల మరమ్మత్తులు చేయడంలో భూగర్భ జలాలను కాపాడటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. దాని ఫలితమే నేటి కరువు పరిస్థితులు. నేటికి తెలంగాణ రాష్ట్రంలో బోర్లుద్వారానే అత్యధిక సాగు భూమి ఉంది. దీనిద్వారా సాగు అయ్యే భూమి 55 లక్షల నుండి 60 లక్షల ఎకరాల దాకా ఉంది. ఈ వర్షాకాలంలోను 45 లక్షల ఎకరాల్లో రైతులు పైర్లు వేశారు. అందుకు కారణం దుర్భిక్ష మే. గత ఏడాదితో పోలిస్తే, ఈ సంవత్సరం 1.7 మీటర్ల వరకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఫలితంగా బోర్ల కింద వేసిన పైర్లు ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. బోర్ల సాగు తో పాటు చెరువుల, కుంటలద్వారా కూడా ఎక్కువ సేద్యం జరుగుతున్నది. తెలంగాణ సంస్కృతికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చెరువులే ప్రధాన జీవనాడిగా ఉంది. తెలంగాణ వ్యాప్తంగా ఇరిగేషన్‌శాఖ అధికారుల గణాంకాల ప్రకారం 46,531 చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటికి 26లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉంది. వీటిల్లో చేరిన మట్టి తీయక పోవడం, కాలువలకు మరమ్మతులు చేయకపోవడం వల్ల నీటి నిల్వ సామర్థం తగ్గి ప్రస్తుతం సుమారు 10 లక్షల ఎకరాల సాగు మాత్రమే జరుగుతున్నది. ఈ ఖరీఫ్ సీజన్ లో ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంవల్ల చెరువుల ద్వారా సాగు భూమి గణనీయంగా తగ్గింది. గత, నేటి పాలకులు సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఉద్దేశపూర్వక వైఫల్యం ఫలితంగా ప్రారంభమైన అనేక ప్రాజెక్టులు పూర్తిగాక పెండింగ్‌లో ఉన్నాయి. కృష్ణా బేసిన్ పరిధిలోని పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఇది మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో సుమారు 12లక్షల ఎకరాలకుపైగా సాగు నీరు అందించే లక్ష్యంతో ప్రారంభించారు. ఇది ఇంకా పూర్తి కాలేదు. మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం: నారాయణపేట, కొడంగల్, రాజీవ్ బీమా, కోయిల్‌సాగర్ , జవహర్ నెట్టంపాడు, తుమ్మిని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు సంబంధించి భూసేకరణ సమస్యలను పరిష్కరించి ఈ పథకాన్ని పూర్తి చేయాల్సి ఉంది. గోదావరి బేసిన్ పరిధిలో (ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలు) దేవాదుల ఎత్తిపోతల పథకం: దీని ద్వారా ఉత్తర, తూర్పు తెలంగాణ లోని సుమారు 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యం తో చేపట్టిన ఈ పథకం 87% పూర్తి కాగా ఇంకా ఇంకా కాల్వల లైనింగ్ పనులు మరియు భూ సేకరణ పనులు మిగిలి ఉన్నాయి. సీతారామ ఎత్తిపోతల పథకం: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధి లోని ఆయకట్టుకు నీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉంది. బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు: ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని కరువు ప్రాంతాలకు గోదావరి జలాలను మళ్లించేందుకు తుమ్మిడిహట్టి వద ఈ ప్రాజెక్టును ప్రారంభించారు ఇది ఇంకా పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉంది. నల్గొండ జిల్లా పరిధిలో 17 ఎత్తిపోతల పథకాలు పూర్తి చేసి జిల్లాలోని చివరి భూములకు నీరు అందించాల్సి ఉంది. నాగార్జున సాగర్ కాలువల లైనింగ్ పనులు పూర్తి చేసి నీటి వృథాను నివారించాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ. 39వేల నుండి 45వేల కోట్ల ఖర్చు అవుతుంది. ఇవి కాక పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లాంటి భారీ ప్రాజెక్టులకు, ప్రధాన కాల్వలకు, రిజర్వాయర్ పనులు పూర్తి చేయడానికి అదనంగా రూ. 14,698 కోట్లు అవసరం అవుతాయి. ఈ ఖర్చును పాలకులకు చేయాలనే స్పృహ ఉంటే తెలంగాణలో సాగునీటి సమస్యలు చాలా వరకు పరిష్కారం అవుతాయి. పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం, పాత అప్పులకు వడ్డీల చెల్లింపుల కోసం నీటి పారుదల శాఖ రూ. 45వేల కోట్ల ప్రతిపాదన పంపగా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బడ్జెట్ రూ. 22,615 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఖర్చు చేసేది చాలా తక్కువగా ఉంది, ప్రాజెక్టులు పూర్తి గాని పరిస్థితులే ఉంటాయి. రాష్ట్రంలో ఏర్పడిన దుర్భిక్షం, కరువు పరిస్థితులు ఎదుర్కోవడంలోనూ, రైతాంగానికి, గ్రామీణ పేదలకు సహాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై విమర్శల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో, కరువు పరిస్థితులను అధ్యయనం చేయడానికి నియమించిన నిపుణుల కమిటీని నియమించింది. ఆ నిపుణుల కమిటీ సహాయం అందించడానికి రూ. 802.92 కోట్ల ప్రత్యేక అత్యవసర ప్యాకేజీ కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దీనిపై ప్రభుత్వ ఎటువంటి ప్రకటన చేయలేదు. రాష్ట్రంలో సాగు కావాల్సిన విస్తీర్ణంతో చూస్తే లక్షలాది ఎకరాల్లో రైతులు సాగు చేయలేక పోయారు. ముఖ్యంగా వరి, పత్తి నారుమళ్లు నీరు లేక తీవ్రంగా దెబ్బతిన్నాయి. లోటు వర్షపాతం వల్ల అనేక జిల్లాల్లో 33% నుండి 50% వరకు పంట దిగుబడి తగ్గే పరిస్థితుల ఏర్పడ్డాయి ప్రాథమిక నివేదిక ప్రకారం 5 లక్షల ఎకరాల్లో పూర్తిగా పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరాయి. మొత్తం పంటల నష్టం విలువ రూ. 5 వేల కోట్ల దాకా ఉంది. తెలంగాణ ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం నుండి తప్పుకోవడం వల్ల రైతులు బీమా పరిహారం కూడా పొందలేరు. ఎకరాకు ప్రభుత్వం ప్రకటించిన 10వేలు నష్టపరిహారం పంటలు నష్టపోయిన రైతులకు ప్రయోజనకరం కాదు. అందుకు కూడా పంట నష్టపరిమితిని విధించినది. రైతుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మాత్రం నష్ట పరిహారం ప్రకటించ లేదు. రాష్ట్రంలో ఏర్పడిన ప్రకృతి విపత్తుల సహాయంలో కేంద్ర ప్రభుత్వ 75% శాతం ఇస్తుంది. అందువల్ల పంట నష్టాలను అంచనా వేసి వెంటనే కేంద్ర ప్రభుత్వానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంపాలి. కేంద్రం సరైన పరిహారం అందించేలా దానిపై ఒత్తిడి పెంచాలి. రాష్ట్రాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించి వెంటనే సహాయక చర్యలు ప్రారంభించాలి.- కౌలు రైతులతో సహా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 15వేల నష్ట పరిహారం ఇవ్వాలి. తిరిగి పంట విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి.- గ్రామీణ పేదలకు ఉపాధి పనులను 250 రోజులకు పెంచి రోజు వేతనం 500 రూపాయలుగా ప్రకటించాలి. వలసలను నివారించాలి.- చౌక డిపోల ద్వారా గ్రామీణ పేదలకు నిత్యావసర వస్తువులను చౌకగా అందించాలి.- పేద,మధ్య తరగతి కుటుంబాల విద్యార్థుల కాలేజీ ఫీజులను రద్దు చేయాలి.- అంటు వ్యాధులు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలి.సహాయం పొందడం ప్రజల హక్కు అని, పాలకుల భిక్ష కాదని తెలంగాణ ప్రజలు సమైక్యంగా ఉద్యమించాలి.

# రూపాయి రూపాంతరం ఇప్పటిట్లో లేనట్లే!




అనుకున్నదే అయిందన్నట్లుగా, ఇటీవల జరిగిన బ్రిక్స్ శీర్షాగ్ర సమావేశంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, రూపాయిని అంతర్జాతీయ కరెన్సీగా గుర్తించే దిశగా కీలక నిర్ణయం వెలువడలేదు. బ్రిక్స్ కూటమి కొత్త ఉమ్మడి కరెన్సీని తీసుకురావాలన్న ఆశలు కూడా ప్రస్తుతానికి తెరపడింది. అయితే, ఈ సమావేశం పూర్తిగా నిరాశపరిచిందని చెప్పలేం. స్థానిక కరెన్సీలలో వాణిజ్య లావాదేవీలు, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను బలపేతం చేయడం వంటి అంశాలపై చర్చ జరగడం భవిష్యత్తుకు కీలకమైన అడుగుగా భావించవచ్చు.

బ్రిక్స్ దేశాల మధ్య రూపాయి, రూబుల్, దిర్హామ్, యువాన్ వంటి స్థానిక కరెన్సీల్లో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచడంపై దృష్టి కోరుసాతోంది. అలాగే స్వదేశీ దేశాల చెల్లింపు వ్యవస్థలను పరస్పరం అనుసంధానించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. బ్రిక్స్ పేమెంట్ టాస్క్‌ఫోర్స్ ద్వారా తక్కువ ఖర్చుతో, వేగంగా, సురక్షితంగా సరిహద్దు చెల్లింపులు నిర్వహించే మార్గాలను అన్వేషించడం కూడా ఇందులో భాగమే.

ముఖ్యంగా, డాలర్‌ను వెంటనే అంతర్జాతీయ వాణిజ్యం నుంచి తొలగించాలన్న బ్రిక్స్ ప్రస్తుత లక్ష్యం కాదనే విషయం స్పష్టమవుతోంది. స్థానిక కరెన్సీల వినియోగాన్ని పెంచడం ద్వారా అంతర్జాతీయ చెల్లింపుల వ్యవస్థను మరింత వైవిధ్యపరచడమే ప్రస్తుత విధానంగా కనిపిస్తోంది. 2025 రియో డి జెనీరో ప్రకటనలో కూడా బ్రిక్స్ సరిహద్దు చెల్లింపుల వ్యవస్థల పరస్పర అనుసంధానాలపై చర్చలను కొనసాగించాలని పేర్కొంది.

ఒకరకంగా చెప్పాలంటే, భారతదేశానికి ఇది ఆసక్తికరమైన పరీక్షా సమయం. ఉదాహరణకు, భారత్-రష్యా వాణిజ్యంలో డాలర్ మధ్యవర్తిత్వాన్ని తగ్గించి, స్థానిక కరెన్సీల్లో సెటిల్‌మెంట్‌ను పెంచే అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడ మరో సమస్య కూడా ఉంది. రెండు దేశాల మధ్య వాణిజ్యం సమతుల్యంగా లేకపోతే, ఒక దేశ కరెన్సీ మరొక దేశంలో నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. భారత్-రష్యా వాణిజ్యంలో ఇటువంటి సమస్యలు గతంలో వచ్చాయి.

మరోవైపు, బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీ విషయంలో భారత్ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి కరెన్సీకి బదులుగా స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థల అభివృద్ధిపైనే ప్రస్తుతం ఎక్కువ దృష్టి ఉంది.

రూపాయి అంతర్జాతీయ కరెన్సీగా రూపాంతరం చెందితే భారత దేశానికి అనేక ప్రయోజనాలు ఉంటాయని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే అంతర్జాతీయ కరెన్సీగా ఎదగడం ఒక్కరోజులో జరిగే పరిణామం కాదు. దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం, ఆర్థిక మార్కెట్ల లోతు, మూలధన ఖాతా స్వేచ్ఛ, ద్రవ్యోల్బణ నియంత్రణ, విదేశీ వాణిజ్య పరిమాణం, కరెన్సీపై అంతర్జాతీయ నమ్మకం వంటి అనేక అంశాలు ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. ఇదిలా ఉంటే, ఇటీవలి కాలంలో డాలర్‌తో పోల్చితే రూపాయి విలువలో గణనీయమైన బలహీనత కనిపిస్తోంది. 2026 సెప్టెంబర్‌లో రూపాయి ఒక డాలర్‌కు రూ. 96 స్థాయికి చేరింది. సెప్టెంబర్ 17న ఇంట్రాడేలో రూ. 96.10 వరకు పడిపోయినప్పటికీ, ఆ తర్వాత కొంత కోలుకుంది. రూపాయి విలువ పడిపోవడం దిగుమతిదారులు, పారిశ్రామిక వేత్తలతో పాటు విదేశీ విద్యను అభ్యసించే భారతీయ విద్యార్థులపై కూడా ప్రభావం చూపుతుంది. విదేశాల్లో విద్య, వసతి, ఇతర ఖర్చులను డాలర్లు లేదా స్థానిక విదేశీ కరెన్సీల్లో చెల్లించాల్సి రావడంతో రూపాయి బలహీనపడినప్పుడు భారతీయ కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతుంది.

రూపాయి అంతర్జాతీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే, ఒకప్పుడు భారత కరెన్సీకి కొన్ని పొరుగు దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ప్రాధాన్యం ఉండేది. అయితే 1966లో రూపాయి విలువ తగ్గింపు అనంతరం పరిస్థితులు మారాయి. అదే సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా డాలర్ ప్రాధాన్యం క్రమంగా మరింత పెరిగింది. 1971లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ డాలర్‌ను బంగారంతో నేరుగా మార్పిడి చేసే విధానాన్ని నిలిపివేయడంతో బ్రిటన్ వుడ్స్ వ్యవస్థలో కీలకమైన మార్పు చోటుచేసుకుంది. అనంతరం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో డాలర్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర కరెన్సీల వినియోగాన్ని పెంచాలన్న చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. యూరో, జపాన్ యెన్, చైనా యువాన్ వంటి కరెన్సీలు అంతర్జాతీయ లావాదేవీల్లో కొంత మేరకు వినియోగంలో ఉన్నప్పటికీ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్ ప్రాధాన్యం ఇంకా గట్టిగానే ఉంది.

చమురు వంటి కీలక వస్తువుల అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ విస్తృతంగా ఉపయోగించబడటంతో 'పెట్రోడాలర్' అనే పదం కూడా ప్రాచుర్యంలోకి వచ్చింది. అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక మార్కెట్లు, విదేశీ మార్పిడి నిల్వలు వంటి రంగాల్లో డాలర్‌కు ఉన్న ప్రాధాన్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా డాలర్‌కు డిమాండ్ కొనసాగుతోంది.

అయితే అంతర్జాతీయ వాణిజ్యం పూర్తిగా డాలర్‌పైనే ఆధారపడాలని భవిష్యత్తు నిర్దేశించలేదు. స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, డిజిటల్ చెల్లింపులు, సరిహద్దు చెల్లింపుల కొత్త వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్నాయి. బ్రిక్స్ కూడా ప్రస్తుతం ఈ దిశగానే అడుగులు వేస్తోంది.

భవిష్యత్తులో రూపాయి అంతర్జాతీయ కరెన్సీగా మరింత ఉన్నత స్థాయిలో వినియోగంలోకి వచ్చే అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేం. అయితే అందుకు దేశీయ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం, ఆర్థిక మార్కెట్లను లోతుగా చేయడం, బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, విదేశీ పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కొనసాగించడం వంటి చర్యలు అవసరం. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా రూపాయి ఎదగడం అనేది కేవలం అంతర్జాతీయ ఒప్పందాలు సరిపోవు. ప్రపంచానికి నమ్మకం కలిగించే స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, బలమైన ఆర్థిక సంస్థలు, విస్తృతమైన వాణిజ్య సంబంధాలు, లోతైన మూలధన మార్కెట్లు అవసరం. అందువల్ల రూపాయి అంతర్జాతీయ కరెన్సీగా రూపాంతరం చెందడం ఒక దీర్ఘకాలిక ప్రక్రియగానే చూడాలి.

బ్రిక్స్ సమావేశం రూపాయికి తక్షణ అంతర్జాతీయ కరెన్సీ హోదాను తీసుకురాకపోయినా, స్థానిక కరెన్సీల్లో వాణిజ్యం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థల చర్చలను ముందుకు తీసుకెళ్లింది. కాబట్టి ప్రస్తుత పరిణామాల్ని రూపాయి ప్రయాణానికి ముగింపుగా కాకుండా, అంతర్జాతీయ కరెన్సీ దిశలో మరో అడుగుగా భావించవచ్చు.

# మంగళగిరిలో మహిళా క్రికెట్ జాతర..
# డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీ ఆవిష్కరించిన నారా బ్రహ్మణి

**-డబ్ల్యూఏపీఎల్ ప్రారంభోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నారా బ్రహ్మణి**

**-మంగళగిరిలో అట్టహాసంగా ప్రారంభమైన తొలి విమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్**

**-నాలుగు జట్లతో మంగళగిరి వేదికగా సెప్టెంబర్ 27 వరకు టోర్నీ**

**-మహిళా సాధికారతే లక్ష్యమన్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్**

**-ఈ లీగ్‌కు దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ మార్గదర్శకత్వం**








**మంగళగిరి, సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)**
ఆంధ్రప్రదేశ్‌లో మహిళా క్రికెట్‌కు కొత్త శకం మొదలైంది. రాష్ట్రం లోని యువ క్రీడాకారిణుల ప్రతిభను వెలుగులోకి తెచ్చి, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూఏపీఎల్) తొలి సీజన్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకకు హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణి ముఖ్య అతిథిగా విచ్చేసి, టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న మిథాలీ రాజ్‌తో కలిసి ఆమె ట్రోఫీని ఆవిష్కరించారు.

**జ్యోతి ప్రజ్వలన చేసిన బ్రహ్మణి**
అంతకుముందు, స్టేడియం ప్రాంగణానికి చేరుకున్న నారా బ్రహ్మణికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీశ్ బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసిన బ్రహ్మణి, మిథాలీ రాజ్‌తో కలిసి డబ్ల్యూఏపీఎల్ ట్రోఫీని ఆవిష్కరించి క్రీడా స్ఫూర్తిని చాటారు.

**ఈ సందర్భంగా నారా బ్రహ్మణి మాట్లాడుతూ...**
మహిళల కోసం ప్రత్యేకంగా ఇలాంటి ఒక ప్రీమియర్ లీగ్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇది రాష్ట్రంలోని యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక అని అభివర్ణించారు. సరైన అవకాశం లభిస్తే మహిళలు ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టిస్తారని, ఈ లీగ్‌లో రాణించే క్రీడాకారిణులు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా (రోల్ మోడల్స్‌గా) నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళగిరి వేదికగా ఇంత మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఏసీఏ అధ్యక్షుడు కేశినేని నాని, కార్యదర్శి సానా సతీశ్ బాబు, ఇతర నిర్వాహకులకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు.

**ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గాభారత క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్**
రాష్ట్రం లోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన యువ మహిళా క్రికెటర్లను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ, అవకాశాలు కల్పించడమే డబ్ల్యూఏపీఎల్ ప్రధాన లక్ష్యం. ఇక్కడ రాణించిన వారిని జాతీయ స్థాయిలో జరిగే ఉమెన్ ప్రీమియర్ లీగ్, భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యేలా ప్రోత్సహించాలన్నది ఏసీఏ సంకల్పం. ఈ లక్ష్యానికి మరింత బలాన్ని చేకూరుస్తూ, భారత క్రికెట్ దిగ్గజం మిథాలీ రాజ్ ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించడం విశేషం. ఆమె స్ఫూర్తితో యువ క్రీడాకారిణులు మరింత ఉత్సాహంగా రాణిస్తారని నిర్వాహకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ఏడు రోజుల పాటు జరగనున్నమొత్తం 13 మ్యాచ్‌లు**
ఫ్రాంచైజీ పద్ధతిలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ టీ-20 టోర్నమెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్, అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ జట్లు ఉన్నాయి. మంగళగిరిలోని ఏసీఏ స్టేడియం వేదికగా ఏడు రోజుల పాటు మొత్తం 13 మ్యాచ్‌లు జరగనున్నాయి. శనివారం మధ్యాహ్నం రాయలసీమ జెన్ స్టార్స్, గోదావరి ఈగల్స్ మధ్య తొలి మ్యాచ్ జరగగా, సాయంత్రం ప్రారంభోత్సవం అనంతరం అమరావతి ఈ-ఛాంపియన్స్, వైజాగ్ ఫైర్ బర్డ్స్ మధ్య రెండో మ్యాచ్ నిర్వహించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, ప్రేక్షకులను అలరించాయి.

**ప్రత్యేక జ్ఞాపికతో నారా బ్రహ్మణికిసత్కారం...**
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నారా బ్రహ్మణిని నిర్వాహకులు ప్రత్యేక జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు, ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు డి. విష్ణుతేజ, క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ కల్యాణ్ కృష్ణ, ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు వైఎస్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ భామ నిధి అగర్వాల్ కూడా సందడి చేశారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి పురస్కారం అందుకున్న ఆచార్య డా. పద్మ ప్రియకు ఘన సన్మానం



**హైదరాబాద్ (సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన "రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు"ను అందుకున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు.

విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య డా. పద్మ ప్రియ ని అభినందిస్తూ శనివారం నాంపల్లి ప్రాంగణంలోని ఎన్‌టీఆర్ ఆడిటోరియంలో జ్యోతిషం--వాస్తు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు , రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు , అకడమిక్ డీన్ డా. వనజా ఉదయ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆచార్య డా. పద్మ ప్రియ ని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, విద్యాబోధనతో పాటు తెలుగు భాష, సాహిత్యం, కళలు మరియు విద్యా రంగానికి ఆచార్య డా. పద్మ ప్రియ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆమెకు లభించిన రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలి పురస్కారం విశ్వవిద్యాలయానికి, అధ్యాపక వర్గానికి, విద్యార్థులకు గర్వకారణమని అన్నారు.ఆచార్య డా. పద్మ ప్రియ మాట్లాడుతూ తనకు లభించిన ఈ పురస్కారం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా, తనతో కలిసి పనిచేసిన సహచర అధ్యాపకులు, విద్యార్థులు మరియు విశ్వవిద్యాలయ కుటుంబం అందరి ప్రోత్సాహానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల అభ్యున్నతి, విద్యా ప్రమాణాల పెంపు మరియు తెలుగు భాషా--సాంస్కృతిక రంగాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జ్యోతిషం--వాస్తు శాఖకు చెందిన ఎం.ఎ. జ్యోతిషం, పీ.జీ. డిప్లొమా ఇన్ జ్యోతిర్వాస్తు, డిప్లొమా ఇన్ జ్యోతిషం, సర్టిఫికెట్ కోర్సు ఇన్ జ్యోతిషం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొని ఆచార్య డా. పద్మ ప్రియ కి శుభాకాంక్షలు తెలిపారు

# విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ సుమతి**





**,ఆర్కే పురం**
ఆర్కేపురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము ఆధ్వర్యంలో లిమహా గణపతి 39వ నవరాత్రి మహోత్సవాల లో భాగంగా ఐదవ రోజు నిర్వహించిన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ లిసుమతి, ఎల్బీనగర్ డిసిపి లిఅనురాధ, ట్రాఫిక్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ లిశ్రీనివాస్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం జరిగిన లిసాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారికి బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీశెట్టి చంద్రశేఖర్ గుప్త, అష్టలక్ష్మి దేవాలయ ఛైర్మెన్ నాగమల్ల శ్రవణ్ కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య , ఉత్సవ కమిటీ కన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, చిలుక ఉపేందర్ రెడ్డి, గౌరిశెట్టి అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, గ్రాంది. శ్రీకాంత్, దండు రాజు, గౌరీ శంకర్, ఐతీ. రాంకిషన్, సత్యనారాయణ, మాలే శ్రీనివాస్, కృష్ణ మూర్తి, రామ స్వామి, మేఘమాల, భ్రమరాంబ, రాధా తదితరులు పాల్గొన్నారు

# విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'..
# లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు

**-విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం**

**-28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ**

**-పేదల ఇళ్ల కోసం 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ**

**-పట్టాలు అందించి ర్యాంప్ వాక్‌తో అలరించిన సీఎం చంద్రబాబు**

**-పంపిణీ చేసిన ఆస్తుల విలువ రూ.8,874 కోట్లు**



**విశాఖపట్నం,సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది.క్రమబద్ధీకరించిన స్థలాలకు పట్టాలను లబ్ధిదారులకు అందజేత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది.

**లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన చంద్రబాబు...**
అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు

# "భూ"లావాదేవీలు ఉన్నవారే పార్టీ మారారు

**-మేనల్లుడు టీడీపీలో చేరడంపై వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ**

**-ఇటీవలే టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను**

**-స్వార్థపూరిత రాజకీయాలు చేసేవారు పార్టీకి అవసరం లేదన్న బొత్స**

**-నిబద్ధత కలిగిన కార్యకర్తలే వైసీపీకి అసలైన బలం అని వ్యాఖ్య**



**అమరావతి,సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)**
పదవులు, భూ లావాదేవీలు, సొంత వ్యాపార ప్రయోజనాలలో మునిగితేలిన నాయకులే ఈ రోజు వైసీపీని వీడి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇటీవలే బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బొత్స చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని రేపుతున్నాయి.

**భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నడిపిన వారే జంప్ అయ్యారు**
సమాజంలో గౌరవంగా ఉన్న ఏ ఒక్క నీతివంతమైన కుటుంబం కూడా తెలుగుదేశం పార్టీ వైపు చూడటం లేదని బొత్స అన్నారు. స్వార్థపూరిత లాలూచీ రాజకీయం చేసే వ్యక్తులు పార్టీకి అవసరం లేదని... ప్రజా సేవకే ప్రాధాన్యమిచ్చే గౌరవప్రదమైన కుటుంబాలు, నిబద్ధత కలిగిన కార్యకర్తలే వైసీపీకి అసలైన బలం అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు తమ ప్రభావాన్ని అడ్డుపెట్టుకుని భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నడిపిన వారే ఇప్పుడు స్వలాభం కోసం జంప్ అయ్యారని మండిపడ్డారు.

**స్వార్థపరులు వీడటం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం జరగదు**
రాజకీయాల్లో హెచ్చుతగ్గులు సహజమని, స్వార్థపరులు వీడటం వల్ల పార్టీకి ఎలాంటి నష్టం జరగకపోగా, మరింత ప్రక్షాళన జరిగి నిజమైన నాయకత్వంతో బలోపేతమవుతుందని బొత్స ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడే ప్రతి సాధారణ కార్యకర్తకు, నాయకుడికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న ప్రజావ్యతిరేక పాలనతో ప్రజలు విసిగిపోయారని, రాబోయే రోజుల్లో వైసీపీ మళ్లీ పూర్తి మెజారిటీతో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కోసం శ్రమించే కార్యకర్తల కష్టాన్ని వృథా పోనివ్వమని, అందరినీ కలుపుకుని మళ్లీ ప్రజాదరణ పొందుతామని పిలుపునిచ్చారు

# వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు అమలు చేయాలి

**రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (నవ సంఘర్షణ)**
ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు అధికంగా ఉన్న (సర్‌ప్లస్) పాఠశాలల నుంచి ఉపాధ్యాయుల కొరత ఉన్న (డెఫిసిట్) పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన ఉపాధ్యాయులను సంబంధిత పాఠశాలల నుంచి విధుల నుంచి రిలీవ్ చేసి, వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా, కేటాయించిన ఉపాధ్యాయులను విధుల నుంచి రిలీవ్ చేయని 83 మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలను ఎలాంటి సముచిత కారణం లేకుండా ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే, సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం తదుపరి విభాగీయ చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉపాధ్యాయుల అందుబాటును సమతుల్యం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# డీయూఎస్‌యూ ఎన్నికల్లో ఏబీవీపీ విజయం




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 నవ సంఘర్షణ)**
ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (డీయూఎస్‌యూ) ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం సాధించింది. నాలుగు కీలక స్థానాల్లో మూడింటిని కైవసం చేసుకుంది. అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను దక్కించుకోగా, కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యూఐ ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది.సంఘం అధ్యక్షుడిగా ఏబీవీపీకి చెందిన యశ్ దబాస్ ఎన్నికయ్యారు. రెండు క్యాంపస్‌లు కలిగి ఉన్న ఢిల్లీ యూనివర్సిటీలో 91 కాలేజీలు ఉండగా, 52కి ఎన్నికలు జరిగాయి. కాగా, గతంలో అరుణ్ జైట్లీ, విజయ్ గోయల్, మాకెన్, అల్కా లాంబా డీయూఎస్‌యూ అధ్యక్షులుగా పనిచేశారు.

# రియాద్ విమానాశ్రయంపై దాడి?

**-ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పొగలు**

**-విమాన సర్వీసులు రద్దు!**



**రియాద్: సెప్టెంబర్ 19 నవ సంఘర్షణ)**
సౌదీ రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో శనివారం భారీగా నల్లని పొగలు, మంటలు కనిపించాయి. ఈ ఘటనతో విమానాల రాకపోకలు ఆలస్యమైనట్లు 'రాయిటర్స్' పేర్కొన్నది.సౌదీ అరేబియాలో వైమానిక ముప్పు హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ పరిణామం చోటుచేసుకోవడం ఆందోళనకు దారి తీసింది. అయితే ఈ మంటలు, పొగలకు కారణమేమిటన్నది అధికారికంగా వెల్లడికాలేదు. ఇరాన్ మద్దతు గల హౌతీ తిరుగుబాటుదారుల దాడుల నేపథ్యంలో రియాద్‌లో హై అలర్ట్ ప్రకటించారు. రియాద్‌లోని కింగ్ ఖలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మంటలు ఎగసిపడటంతోపాటు దట్టమైన నల్లని పొగలు ఆకాశంలో వ్యాపించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. విమానాల ట్రాకింగ్ డాటా ప్రకారం రియాద్ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని విమానాలు గణనీయంగా ఆలస్యమైనట్లు సమాచారం. అలాగే విమానాశ్రయంలోని ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తున్నది. కాగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు సౌదీ అరేబియాలోని పలు ప్రాంతాల్లో అధికారులు అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు.

# ప్రభుత్వ సాయం పొందితే శాశ్వత నివాసం దూరం!

**ఈ కారణాలతో గ్రీన్ కార్డ్ అప్లికేషన్ తిరస్కరించవచ్చు**

**ట్రంప్ సర్కార్ కొత్త పబ్లిక్ చార్జ్ నిబంధన అమల్లోకి**




**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 నవ సంఘర్షణ)**
అమెరికాలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునే వలసదారులు వైద్య సహాయం, ఫుడ్ స్టాంప్‌లు, ట్యూషన్ సహాయం, పాఠశాల ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమాలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలను వినియోగించుకుంటే వారి దరఖాస్తులు తిరస్కరణకు గురవుతాయి. ట్రంప్ ప్రభుత్వం విస్తరించిన పబ్లిక్ చార్జ్ నిబంధన శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది.హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అంచనాల ప్రకారం ఇది సుమారు 9.50 లక్షల మంది దేశం విడిచి వెళ్లేలా లేదా ఫెడరల్ భద్రతా పథకాలను తప్పించుకునేలా ప్రోత్సహించడం ద్వారా సంవత్సరానికి ఫెడరల్, రాష్ట్ర చెల్లింపులను1.1300 కోట్ల డాలర్ల మేర తగ్గించగలదు. ఈ నిబంధన అమెరికాలో నివసిస్తున్న విదేశీయులు స్వయం సమృద్ధిగా ఉండాలి, పన్ను చెల్లింపుదారుల నిధులతో నడిచే ప్రభుత్వ ప్రయోజనాలపై ఆధారపడకూడదు అనే కాంగ్రెస్ ఉద్దేశాన్ని ప్రతిబింబిస్తున్నదని డీహెచ్ఎస్ విధాన పత్రం పేర్కొన్నది.

**కొత్త నిబంధనపై పిటిషన్**
ట్రంప్ ప్రభుత్వం అమలు చేసిన కొత్త నిబంధనను వ్యతిరేకిస్తూ న్యూయార్క్‌తోపాటు మరో 21 రాష్ట్రాలు ఒక పిటిషన్ దాఖలు చేశాయి. ఈ నిబంధన సృష్టించే అనేక ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవడంలో ట్రంప్ ప్రభుత్వం విఫలమైందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# వాణిజ్య నౌకాయానం లక్ష్యం కారాదు

**ఐరాసలో తీవ్రంగా ఖండించిన భారత్**



**న్యూఢిల్లీ, నవ సంఘర్షణ)**
భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వాణిజ్య నౌకాయానాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని, నౌకల స్వేచ్ఛాయుత ప్రయాణ హక్కులను ఎవరూ అడ్డుకోరాదని ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ స్పష్టంచేసింది. బహ్రెయిన్ అధ్యక్షతన సముద్ర భద్రతపై నిర్వహించిన భద్రతామండలి సమావేశంలో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పీ హరీశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛాయుతమైన, బహిరంగ, సురక్షితమైన సముద్ర జలాలపట్ల భారత్ తన నిబద్ధతను వదులుకోదని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతాల్లో జరుగుతున్న దాడుల కారణంగా భారతీయ నౌకలు, నావికులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా హార్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల ఫలితంగా చమురు, గ్యాస్ సరఫరాలకు ఆటంకం ఏర్పడి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని అన్నారు. గత ఏప్రిల్‌లో ఇరాన్ దళాలు రెండు భారత నౌకలపై హెచ్చరికగా కాల్పులు జరపడం, జూలైలో ఇరాన్ జరిపిన దాడిలో ఒక భారత నావికుడు మరణించడం, మరొకరు గాయపడటం లాంటి ఘటనలను ఆయన ప్రస్తావించారు. అదేవిధంగా జూన్ నెలలో అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారత నావికులు ప్రాణాలు కోల్పోయారని, ఈ పరిణామాలపై సంబంధిత దేశాలకు ఇప్పటికే నిరసన తెలియజేశామని పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్య మార్గాల రక్షణలో భారత నావికాదళం చురుకైన పాత్ర పోషిస్తోందని హరీశ్ వివరించారు. భారత భద్రతా ఆపరేషన్ల పర్యవేక్షణలో ఇప్పటివరకు 449 వాణిజ్య నౌకలు సురక్షితంగా ప్రయాణించాయని, వీటి ద్వారా సుమారు 8.4 బిలియన్ డాలర్ల విలువైన కార్గో రవాణా జరిగిందని వెల్లడించారు. ఇంధన మార్గాల భద్రత కోసం పశ్చిమ అరేబియా సముద్రంలో 11 నౌకలతో 'ఆపరేషన్ ఊర్జా సురక్ష'ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. దిగ్బంధనాల కారణంగా హార్మూజ్ జలసంధిలో చిక్కుకున్న వందలాది మంది భారత నావికుల భద్రత, వారిని సురక్షితంగా తీసుకురావడంపై అంతర్జాతీయ సమాజం దృష్టి సారించాలని కోరారు. మానవరహిత వ్యవస్థలు, సైబర్ దాడుల రూపంలో ఎదురవుతున్న నూతన సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సహకారం అత్యవసరమని ఆయన పిలుపునిచ్చారు.

# అక్టోబర్ 15 నుంచి పెట్రోల్ బంకుల్లో యూపీఐ బంద్?

**మధ్యప్రదేశ్, ముంబై డీలర్ల హెచ్చరిక**







**ముంబై నవ సంఘర్షణ)**
అక్టోబర్ 15 నుంచి మధ్యప్రదేశ్‌తో పాటు ముంబై మహానగరంలోని పెట్రోల్ బంకుల్లో యూపీఐ చెల్లింపులను నిలిపివేయనున్నట్లు పెట్రోల్ డీలర్లు హెచ్చరించారు. రూ. 2000కు మించిన లావాదేవీలపై విధించిన కొత్త మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) నుంచి ఇంధన విక్రయదారులకు మినహాయింపు ఇవ్వకపోతే ఈ నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ ఆఫ్ ముంబై(పీడీఏఎం) ఈ అంశంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ), కేంద్ర ఆర్థికశాఖకు లేఖ రాసింది. ఇంధన రిటైలర్లకు ఎండీఆర్ చార్జీలను మినహాయించాలని కోరింది. ఈ ఛార్జీలను వెనక్కి తీసుకోకపోతే యూపీఐ సదుపాయాన్ని ఉపసంహరించుకుంటామని హెచ్చరించింది. మధ్యప్రదేశ్ పెట్రోల్ పంప్స్ డీలర్స్ అసోసియేషన కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సీఐఏటీ) మధ్యప్రదేశ్ ప్రతినిధి ధర్మేంద్ర శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 4,700 పెట్రోల్ బంక్‌లపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందన్నారు. కొత్త విధానం అమల్లోకి వస్తే ఒక్కో పెట్రోల్ బంక్‌కు నెలకు సుమారు రూ. 17,700 వరకు అదనపు భారం పడుతుందని ఆయన పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తమ ఇష్టానుసారం నిర్ణయించే అవకాశం డీలర్లకు లేకపోవడంతో ఎండీఆర్ రూపంలో వచ్చే అదనపు ఖర్చును వినియోగదారులపై నేరుగా మోపలేమని ఆపరేటర్లు అంటున్నారు.

**యూపీఐ ద్వారా చెల్లింపులు అంగీకరించం**
యూపీఐ లావాదేవీలపై ప్రభుత్వం విధించనున్న చార్జీలకు వ్యతిరేకంగా యూపీలోని వర్తకులు ఆందోళనకు దిగుతున్నారు. ఘజియాబాద్‌లోని పలు దుకాణాలలో ఇప్పటికే యూపీఐ చెల్లింపులు అంగీకరించబోమంటూ నోటీసులు అంటించడం విశేషం. రెండు వేల రూపాయలకు పైగా జరిగే లావాదేవీలపై అక్టోబర్ 15 నుంచి మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) 0.4 శాతం విధిస్తామంటూ కేంద్రం ఇటీవల ఆదేశాలు జారీ చేయడంతో వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం వర్తకులకు మాత్రమే విధిస్తామని ప్రభుత్వం చెబుతున్నా, అంతిమంగా ఆ చార్జీ వినియోగదారుల మీద మోపుతారన్నది అందరికీ తెలిసిందే. దీంతో అక్టోబర్ 15 తర్వాత రెండు వేలకు పైగా లావాదేవీలు జరిపే వారు నగదును తీసుకురావాలంటూ పౌరులకు వ్యాపారులు సూచిస్తున్నారు.

# రోడ్డు వేయకపోతే ఓటు వేసే ప్రసక్తే లేదు

**కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు తెగేసి చెప్పిన ప్రజలు**



**సెప్టెంబర్ 19: నవ సంఘర్షణ)**
మధ్యప్రదేశ్‌లోని గుణ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి, బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియాకు నియోజకవర్గ ప్రజల నుంచి నిరసన సెగ తగలింది.
నియోజకవర్గంలోని ఒక గ్రామానికి వెళ్తున్న ఆయన కాన్వాయ్‌ను ఆపిన స్థానికులు చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డును వెంటనే వేయించాలని డిమాండ్ చేశారు. రోడ్డు వేయకపోతే ఓటు వేయమంటూ ఈ సందర్భంగా ఆయనను హెచ్చరించారు. అయితే ప్రజలు తనను హెచ్చరించిన తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్చరికకు బదులుగా అభ్యర్థన చేయాలని, ఆ పనిని పూర్తి చేసే బాధ్యతను తనకు వదిలేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కాన్వాయ్‌ను చుట్టుముట్టిన ప్రజలు చేతుల్లో ప్లకార్డులు ధరించి 'రోడ్డు వేయకపోతే ఓటు వేయం' అంటూ నినాదాలు చేశారు. 'ఈసారి మీరు ఈ రోడ్డు వేయాల్సిందే. లేకపోతే ఎన్నికల సమయంలో వచ్చి ఓటు అడిగితే మేం వేయబోం' అని కాలనీవాసులు మంత్రికి తెగేసి చెప్పారు. ఇది జరిగిన అరగంట తర్వాత ఒక బహిరంగ సభలో రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు

# కేజ్రీవాల్‌కు 'సర్' నోటీసులు

**ఆయన కుటుంబ సభ్యులకు కూడా.. ఈసీపై ఆప్ విమర్శలు**



**న్యూఢిల్లీ:నవ సంఘర్షణ)**
ఢిల్లీలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా ఎన్నికల సంఘం అధికారులు మాజీ సీఎం, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, అతని కుటుంబ సభ్యులు నలుగురికి నోటీసులు జారీ చేశారు. న్యూఢిల్లీ-40 అసెంబ్లీ నియోజకవర్గ ఓటరైన కేజ్రీవాల్, అతని భార్య, కుమారుడు, తల్లిదండ్రులకు నోటీసులు జారీ చేయడం పట్ల ఆమ్ ఆద్మీ పార్టీ విస్మయం వ్యక్తం చేసింది. ఈ దేశంలో జరుగుతున్నదంతా పరమేశ్వరుడిని సంతోషపెట్టడానికేనా? మూడుసార్లు ఢిల్లీకి సీఎంగా పనిచేసిన కేజ్రీవాల్‌తో పాటు, అతని కుటుంబ సభ్యుల ఓట్లు గల్లంతు కావడం ఎలా సాధ్యం' అని పేర్కొన్నది. కాగా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు సైతం నోటీసులు జారీ చేసినట్టు ఈసీ తెలిపింది. ఓటరు జాబితాలో ఆమె పేరులో తేడా కన్పించడంతో నోటీసులు పంపినట్టు తెలిపింది. ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమైన సర్ ప్రక్రియ తర్వాత 1.45 కోట్లు ఉండే ఢిల్లీ ఓటర్లను 97.5 లక్షలకు తగ్గిస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. తొలగింపునకు గురైన వారు ఈనెల 30 లోగా తమ అభ్యంతరాలు తెలుపుతూ దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొనగా, స్వల్ప సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు.

# మమతాబెనర్జికి దెబ్బమీద దెబ్బ..



**న్యూఢిల్లీ:నవ సంఘర్షణ)**
పశ్చిమబెంగాల్ ఉప ఎన్నికలకు ముందు మమతాబెనర్జీ వర్గానికి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. నందిగ్రామ్ లో అభ్యర్థి సంచితా ప్రధాన్ డే నామినేషన్ ఉపసంహరించుకున్న మరుసటిరోజే రేజీనగర్ లోనూ మమత వర్గం అభ్యర్థి రబియుల్ ఆలం చౌధురి ఎన్నికల బరి నుంచి తప్పుకొన్నారు. అక్టోబర్ 6న రెండు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగనున్నాయి.రబియుల్ ఆలం చౌధురి శనివారం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. పార్టీకి అధికారిక గుర్తు లేకపోవడం, కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో ఎన్నికల్లో పోటీచేయడం కష్టంగా మారిందని ఆయన తెలిపారు. పరిపాలనా ఒత్తిడివల్ల పలువురు కార్యకర్తలు ప్రాంతాన్ని విడిచి వెళ్లారని చెప్పారు. శుక్రవారం నందిగ్రామ్ అభ్యర్థి సంచితా ప్రధాన్ డే కూడా నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఆమె అంతకుముందు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి చర్చలు జరిపారు. ఆ తర్వాతే నామినేషన్ ఉపసంహరణ నిర్ణయం వెలువడింది. నందిగ్రామ్‌లో సంచిత తప్పుకోవడంతో మమతాబెనర్జీ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ప్రకటించారు. అయితే ఆ తర్వాత మిలన్ ప్రధాన్ 2007 నాటి హత్య కేసులో అరెస్టయ్యారు. దాంతో అక్కడి పరిణామాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఇక తృణమూల్ కాంగ్రెస్ పేరు, గుర్తుపై రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం అసలు పార్టీ పేరు, 'పూలు-గడ్డి' గుర్తును తాత్కాలికంగా నిలిపివేసింది. మమతా వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరుతో 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును కేటాయించింది. ప్రత్యర్థి వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'కవర్' గుర్తుఇచ్చింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ మమత సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

## బిజినెస్

# భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

హైదరాబాద్: బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా పెరిగాయి. శనివారం హైదరాబాద్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులకు షాక్ తగిలింది. బంగారం ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరుకోగా.. వెండి ధర కూడా భారీగా పెరిగింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.1,300 పెరిగి రూ.1,42,850కు చేరింది. అదే సమయంలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,420 పెరిగి రూ.1,55,840గా నమోదైంది. ఒక్కరోజులోనే ధరలు భారీగా పెరగడంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారిపై అదనపు భారం పడుతోంది. ఇక వెండి ధర కూడా భారీగా పెరిగింది. కిలో వెండి ధర



రూ.5,000 పెరిగి రూ.2,60,000కు చేరుకుంది. బంగారం, వెండి ధరలు వరుసగా పెరుగుతుండటంతో కొనుగోలుదారులు మార్కెట్ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్ ధరలను ఆధారంగా ఈ రేట్లు నమోదయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థానిక మార్కెట్, ప్రాంతాలను బట్టి బంగారం, వెండి ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. నగలు కొనుగోలు చేసే సమయంలో తయారీ ఛార్జీలు, పన్నులు అదనంగా వర్తించవచ్చు. మొత్తంగా శనివారం బంగారం, వెండి ధరలు భారీగా పెరగడంతో పసిడి, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ధరలు మరింత భారంగా మారాయి.

# ఫ్లిప్‌కార్ట్‌లో ఐఫోన్ 17పై భారీ తగ్గింపు!



యాపిల్ కొత్త ఐఫోన్ 18 మార్కెట్లోకి వచ్చిన నేపథ్యంలో పాత మోడళ్లపై భారీ ఆఫర్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఇందులో భాగంగా ఫ్లిప్‌కార్ట్ ఐఫోన్ 17పై భారీ తగ్గింపును ప్రకటించింది. వివిధ ఆఫర్లను వినియోగించుకుంటే ఐఫోన్ 17ను గణనీయంగా తక్కువ ధరకే సొంతం చేసుకునే అవకాశం ఉంది. ఫ్లిప్‌కార్ట్‌లో రూ.99,900 విలువైన ఐఫోన్ 17 256జీబీ తెలుపు రంగు వేరియంట్‌ను రూ.55,283కే పొందే అవకాశం ఉంది. అయితే ఈ ధరకు చేరుకోవాలంటే ఎక్స్ఛేంజ్ ఆఫర్, సూపర్‌కాయిన్లు, ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ కార్డు ఆఫర్లను కలిపి వినియోగించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఐఫోన్ 15ను కలిగి ఉన్న వినియోగదారులకు కూడా ఎక్స్ఛేంజ్ ఆఫర్ అందుబాటులో ఉంది. ఐఫోన్ 15ను ఎక్స్ఛేంజ్ చేస్తే గరిష్ఠంగా రూ.41,700 వరకు తగ్గింపు లభించే అవకాశం ఉంది. పాత ఫోన్ పరిస్థితి, మోడల్, నిల్వ సామర్థ్యం తదితర అంశాల ఆధారంగా ఎక్స్ఛేంజ్ విలువ మారవచ్చు. దీనికి అదనంగా ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ కార్డు ఆఫర్లు, సూపర్‌కాయిన్ల ప్రయోజనాలను పొందవచ్చు. కొనుగోలుదారుల సౌకర్యం కోసం ఈఎంఐ సదుపాయం కూడా అందుబాటులో ఉంది. అయితే అన్ని ఆఫర్లు, తగ్గింపులు నిబంధనలకు లోబడి ఉంటాయి. కొనుగోలు చేసే ముందు ఫ్లిప్‌కార్ట్‌లో వర్తించే ఆఫర్లను పరిశీలించడం మంచిది.

# తగ్గిన చక్కెర ధరలు.. పండుగ వేళ వినియోగదారులకు ఊరట

పండుగల సీజన్ సమీపిస్తున్న వేళ బహిరంగ మార్కెట్‌లో చక్కెర ధరలు గణనీయంగా తగ్గాయి. గత మూడు వారాల్లో కిలో చక్కెర ధర దాదాపు 10 శాతం మేర తగ్గింది. మూడు వారాల క్రితం కిలో చక్కెర రూ.65గా ఉండగా.. ప్రస్తుతం రూ.58.50కు చేరింది. పండుగల సమయంలో చక్కెరకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ధరలు తగ్గడం వినియోగదారులకు కొంత ఊరటనిస్తోంది. పండుగల సీజన్‌లో మిఠాయిలు, స్వీట్లు, ఇతర ఆహార పదార్థాల తయారీకి చక్కెర వినియోగం పెరుగుతుంది. దీంతో సాధారణ రోజులతో పోలిస్తే చక్కెరకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ సమయంలో మార్కెట్‌లో కొరత ఏర్పడితే ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే చక్కెర సరఫరా సజావుగా కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ద మొత్తంలో చక్కెరను వినియోగించే వ్యాపారులు, పారిశ్రామిక సంస్థల నిల్వ పరిమితిని కేంద్రం పెంచింది. ఇప్పటివరకు 15 రోజుల అవసరాలకు సరిపడా చక్కెరను నిల్వ చేసుకునేందుకు అనుమతి ఉండగా.. ఆ పరిమితిని 30 రోజులకు పెంచింది. దీంతో పెద్ద వినియోగదారులు ముందుగానే కొంత ఎక్కువ మొత్తంలో చక్కెరను నిల్వ చేసుకునే



అవకాశం లభించింది. అయితే అదనంగా పెంచిన నిల్వలను దేశీయ మార్కెట్ నుంచి కొనుగోలు చేసిన చక్కెరతో భర్తీ చేయడానికి వీలు ఉండదు. పెరిగిన అదనపు నిల్వలను దిగుమతి చేసుకున్న చక్కెర లేదా అడ్వాన్స్ ఆథరైజేషన్ పథకం కింద సేకరించిన చక్కెరతోనే భర్తీ చేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నిబంధన ద్వారా దేశీయ మార్కెట్‌లో చక్కెర అందుబాటుపై ఒత్తిడి పెరగకుండా చూడాలని భావిస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో చక్కెర ధరలు తగ్గుతున్న సమయంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. పండుగల సమయంలో వినియోగం పెరిగినా మార్కెట్‌లో తగినంత సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవడం ద్వారా ధరల్లో అనవసరమైన పెరుగుదలను నియంత్రించేందుకు ప్రయత్నం జరుగుతోంది. చక్కెర ధరలు మూడు వారాల్లోనే రూ.65 నుంచి రూ.58.50కు తగ్గడంతో ఇప్పటికే వినియోగదారులకు కొంత ప్రయోజనం లభిస్తోంది. రానున్న పండుగల సమయంలో సరఫరా కూడా స్థిరంగా కొనసాగితే ధరలు అదుపులోనే ఉండే అవకాశం ఉంది. అయితే మార్కెట్‌లో డిమాండ్, సరఫరా పరిస్థితులను బట్టి ధరల్లో మార్పులు ఉండవచ్చు.

## స్పోర్ట్స్

# కోహ్లి, రోహిత్ కాదు.. భారత జట్టులో 'టఫ్ బ్యాటర్' అతడే..!

భారత క్రికెటర్లలో ఎవరికి బౌలింగ్ చేయడం కష్టం? అని అడగ్గానే.. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ అని టక్కున చెప్పేస్తారు ఎవరైనా. కానీ, ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాత్రం వీరిద్దరు కాదంటున్నాడు. ఇటీవల కమిన్స్ మాట్లాడుతూ తనకు సవాల్ విసిరిన భారత క్రికెటర్ పేరును ఇటీవల వెల్లడించాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో పలుదేశాల నుంచి సవాల్ విసిరిన ఆటగాళ్ల గురించి చెప్పిన ఆసీస్ సారథి.. టీమిండియాతో మ్యాచుల్లో విరాట్, హిట్‌మ్యాన్ కాకుండా తనను ఛతేశ్వర్ పుజారా ఎక్కువగా ఇబ్బంది పెట్టాడని తెలిపాడు. భారత క్రికెట్‌లో దిగ్గజ ఆటగాళ్లు చాలామందే ఉన్నారు. వరల్డ్ క్లాస్ బ్యాటింగ్ విన్యాసాలతో మేటి బౌలర్లను గడగడ వణికించిన వారికి కొదవలేదు. అయితే.. వీరిలో టన్నుల కొద్ది పరుగులు సాధించిన విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ అందరికంటే కాస్త ముందు వరసలో ఉంటారనుకుంటాం. ఎందరో బౌలర్లపై పైచేయి సాధించిన ఈ ఇద్దరు తనను అంతగా ఇబ్బంది పెట్టలేదని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అంటున్నాడు. భారత్ విషయానికొస్తే.. తనను అత్యంత కష్టపెట్టింది మాత్రం ఛతేశ్వర్ పుజారా అని కమిన్స్ అన్నాడు. తాజాగా ప్రైమ్ వీడియో స్పోర్ట్స్ అంజ్‌లో మాట్లాడిన ప్యాటీ .. పుజారా పట్టుదల, అంకితభావం అమోఘమని, అందుకే అతడిని ఔట్



చేయడం కష్టంగా తోచేదని పేర్కొన్నాడు. టీమిండియాలో పుజారాను ఔట్ చేయడం చాలా కష్టం. అతడు నా వ్యూహాలను చిత్తు చేసేవాడు. అతడు అనుకుంటే సంతోషంగా 100 డాట్ బాల్స్ ఆడేవాడు. అంతేతప్ప ప్రత్యర్థి బౌలర్లకు ఒక్క అవకాశం కూడా ఇచ్చేవాడు కాదు అని కమిన్స్ వెల్లడించాడు.

కుక్, డివిలియర్స్..

అలానే వివిధ దేశాల జట్లలో తనకు సవాల్ విసిరిన, తాను ఫిదా అయిన క్రికెటర్ల పేర్లను ఆసీస్ కెప్టెన్ ఈ వీడియోలో చెప్పాడు. మూడు ఫార్మాట్ల కెరీర్లో బ్రెండన్ మెక్‌కల్లమ్(న్యూజిలాండ్), తిలకరత్నే దిల్షాన్ (శ్రీలంక), అలెస్టర్ కుక్(ఇంగ్లండ్), ఏబీ డివిలియర్స్(దక్షిణాఫ్రికా), క్రిస్ గేల్ (వెస్టిండీస్)లు తనను ఇబ్బంది పెట్టారని కమిన్స్ వివరించాడు. ఇక పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ఓవర్లో ఆఖరి బంతికి తాను క్లీన్‌బౌల్డ్ అవ్వడం తనకింకా గుర్తుందని కమిన్స్ అన్నాడు. అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్నాడీ వెటరన్ పేసర్.

# గేమ్ షో హోస్ట్‌గా హిట్‌మ్యాన్.. భారత క్రికెటర్లతో నవ్వుల సందడి!

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయబోతున్నాడు. మైదానంలో భారీ సిక్సర్లు, అద్భుతమైన షాట్లతో అభిమానులను అలరించే 'హిట్‌మ్యాన్'.. ఇప్పుడు టీవీ తెరపై హోస్ట్‌గా సందడి చేయనున్నాడు. సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారం కానున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' గేమ్ షోకు రోహిత్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో రోహిత్ భారత క్రికెటర్లతో కలిసి సరదాగా ఆటలు ఆడుతూ, కౌంటర్లు, సెటైర్లతో సందడి చేయనున్నాడు. భారత ఆటగాళ్లు శ్రేయాస్ అయ్యర్, శార్దూల్ ఠాకూర్‌తో పాటు మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్, భారత జట్టు మాజీ కోచ్ అభిషేక్ నాయర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. వీరితో రోహిత్ చేసిన సరదా సంభాషణలు, ఆటపట్టించే సన్నివేశాలు ప్రేక్షకులను నవ్వించనున్నాయి. క్రీజులో ఎంతో ప్రశాంతంగా కనిపించే రోహిత్.. మైదానం వెలుపల మాత్రం



తనదైన హాస్యంతో పలుమార్లు అభిమానులను ఆకట్టుకున్నాడు. ఇప్పుడు పూర్తిస్థాయి హోస్ట్‌గా మారి గేమ్ షోను నడిపించడంతో ఈ కార్యక్రమంపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే షో షూటింగ్ పూర్తయింది. 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' కార్యక్రమం శనివారం రాత్రి 9:30 గంటలకు సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారం కానుంది. ఇదే సంస్థకు చెందిన సోనీలివ్ వేదికపైనా ఈ కార్యక్రమాన్ని వీక్షించే అవకాశం ఉంది. షోకు సంబంధించిన ప్రచార వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రోహిత్ అభిమానుల్లోనూ ఆసక్తి పెరిగింది. మరోవైపు క్రికెట్ విషయానికొస్తే.. 2027 వన్డే ప్రపంచకప్ రోహిత్ శర్మకు కీలక లక్ష్యంగా మారింది. వన్డే జట్టులో తన స్థానాన్ని కొనసాగించాలంటే రానున్న మ్యాచ్‌ల్లో రాణించడం అతడికి ముఖ్యంగా మారింది. వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే సిరీస్‌లో రోహిత్ ప్రదర్శనపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సిరీస్‌లో అతడి ఆటతీరు, భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# డిసెంబర్‌లో ఐపీఎల్ 2027 వేలం..

### ఈసారి టాప్‌లో ఎవరుంటారో?



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కీలక పదవులకు ఎన్నికలు ముగియడంతో 20వ సీజన్ వేలం పై స్పష్టత వచ్చింది. ఈ డిసెంబర్‌లోనే మినీ వేలం జరుగనుంది. డిసెంబర్ రెండో వారంలో ఆక్షన్ నిర్వహించేందుకు బీసీసీఐ , ఐపీఎల్ పాలకమండలి సన్నాహకాలు చేస్తున్నాయి. గత మూడు సీజన్లుగా విదేశాల్లోనే వేలం పాట జరుపుతున్నారు. దాంతో, ఈసారి కూడా అదే ఒరవడిని కొనసాగిస్తారా? అనేది తెలియాల్సి ఉంది. త్వరలోనే వేలం షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముంది.ఐపీఎల్ సీజన్‌కు ముందు ఆనవాయితీ అయిన వేలానికి వేళవుతోంది. ఇరవయ్యో సీజన్ కోసం డిసెంబర్ రెండో వారంలో వేలం నిర్వహించేందుకు బీసీసీఐ, ఐపీఎల్ కార్యవర్గం సిద్ధమవుతున్నాయి. శుక్రవారం జరిగిన బోర్డు 95వ వార్షిక సమావేశంలో ఐపీఎల్ మినీ వేలం అంశంపై సభ్యులు చర్చించారు. అందరి సూచన మేరకు త్వరలోనే పది ఫ్రాంచైజీల యజమానులతో మాట్లాడి వేలం తేదీలను ఖరారు చేయనుంది బీసీసీఐ. అయితే.. గత మూడు సీజన్ల మాదిరిగా దుబాయ్, అబూదాభీలోనే వేలం నిర్వహిస్తారా? అనేది తెలియాల్సి ఉంది. 2023-27 సైకిల్‌లో ఇదే ఆఖరి మినీ వేలం. ఐపీఎల్ మొదలై 20 ఏళ్లు కాబోతున్నందున ఈ సీజన్‌ను ఘనంగా జరపాలని బీసీసీఐ భావిస్తోంది. ఇప్పటికే ఐపీఎల్ కార్యవర్గానికి ఎన్నికలు ముగియడంతో వేలంపై కసరత్తు చేస్తోంది బీసీసీఐ. 19వ సీజన్ వేలం డిసెంబర్ 16శ్రీ జరిగినా.. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా టోర్నీ ఆలస్యంగా మొదలైంది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ కారణంగా కొన్ని మ్యాచ్‌లు రద్దయ్యాయి. ఇటీవలే అరుణ్ ధుమాల్ ఐపీఎల్ చైర్మన్‌గా, ఖైరుల్ మజుందార్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన విషయం తెలిసిందే. నిరుడు మినీ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా కామెరూన్ గ్రీన్ రికార్డు నెలకొల్పాడు. ఈ ఆస్ట్రేలియన్ ఆల్‌రౌండర్‌ను ఏకంగా రూ.25.20 కోట్లకు కొన్నది కోల్‌కతా నైట్ రైడర్స్. రెండో అత్యధిక ధర రూ.18 కోట్లను మథీశ పథిరన కోసం ఆ ఫ్రాంచైజీయే చెల్లించింది.

టాప్ -5లో వీళ్లే

కామెరూన్ గ్రీన్(ఆస్ట్రేలియా) -- రూ.25.20 కోట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్
మథీశ పథిరన(శ్రీలంక) -- రూ.18 కోట్లు, కోల్‌కతా నైట్ రైడర్స్
కార్తిక్ శర్మ (భారత్, అన్‌క్యాప్డ్) -- రూ.14.20 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్
ప్రశాంత్ వీర్(భారత్, అన్‌క్యాప్డ్) -- రూ.14.20 కోట్లు, చెన్నై సూపర్ కింగ్స్
లియాం లివింగ్‌స్టోన్(ఇంగ్లండ్) -- రూ.13 కోట్లు, సన్‌రైజర్స్ హైదరాబాద్

## నాని 'ది ప్యారడైజ్' సినిమాలో

# 'పొడుస్తున్న పొద్దుమీద'?



నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మాస్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేయగా, తాజాగా మ్యూజికల్ ఫీస్ట్‌కు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతంలో రాబోతున్న పాటల జాబితా నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ గీతంగా కోట్లాది మంది ప్రజల హృదయాలను హత్తుకున్న ప్రసిద్ధ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అమూల్యమైన గీతం 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా...' పాటను ఈ సినిమాలో ఉపయోగిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలతో పాటు ఈ ఐకానిక్ ఫోక్ సాంగ్ కూడా సినిమాలో చోటు చేసుకుంటే, థియేటర్లలో ప్రేక్షకుల ఊపు చూసి థియేటర్లు ఊగిపోవడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. అనిరుధ్ మ్యూజిక్, శ్రీకాంత్ ఓదెల టేకింగ్, నాని మాస్ పెర్ఫార్మెన్స్‌కు తోడు ఈ ఫోక్ సాంగ్ తాలుక వైబ్స్ తోడైతే సిల్వర్ స్క్రీన్ మీద రికార్డులు తిరగరాయడం పక్కా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై చిత్రయూనిట్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇవి కేవలం రుమర్స్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.



## సింపుల్ లుక్‌లో డ్రాగన్ బ్యూటీ..

# 'జైలర్ 2' నుంచి అదిరిపోయే అప్‌డేట్.. విలన్‌గా మలయాళ స్టార్ ఎంట్రీ!




సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ప్రమోషన్స్‌ను అధికారికంగా ప్రారంభించిన చిత్ర బృందం, చిత్రంలోని కీలక నటీనటుల పాత్రలను పరిచయం చేసే రోల్‌అవుట్‌ను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా విడుదలైన మొదటి క్యారెక్టర్ ప్రోమోలో మలయాళ స్టార్ నటుడు సూరజ్ వెంజరమూడు పాత్రను మేకర్స్ రివీల్ చేశారు. ఈ చిత్రంలో సూరజ్ వెంజరమూడు 'దిలీప్' అనే అత్యంత పవర్‌ఫుల్ మరియు ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. విడుదల చేసిన 35 సెకన్ల క్యారెక్టర్ ప్రోమోలో ఆయన కారు దిగి సిగార్ కాలుస్తూ చాలా స్టైలిష్‌గా, భయంకరమైన లుక్‌లో అందరినీ ఆకట్టుకున్నారు. అనిరుధ్ రవిచందర్ అందించిన కేరళ డ్రమ్స్ మిక్స్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ పాత్ర ఎంట్రీకి భారీ హైప్‌ను తీసుకువచ్చింది.ఈ ప్రోమోలో ఆయన పాత్రకు సంబంధించిన పూర్తి వివరాలను సస్పెన్స్‌గా ఉంచినప్పటికీ, ఆయన లుక్ మరియు మేనరిజమ్స్ చూస్తుంటే ముత్తువేల్ పాండియన్ పాత్రను ఢీకొట్టే ప్రధాన విలన్‌గా లేదా ఒక బలమైన యాంటీ హీరోగా కనిపించబోతున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. మొదటి భాగంలో వినాయకన్ పోషించిన వర్మన్ పాత్ర ఎంతలా సంచలనం సృష్టించిందో, ఈ సీక్వెల్‌లో సూరజ్ పాత్ర అంతకంటే పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రంలో రమ్యకృష్ణన్, యోగిబాబు, మీర్నాలు తమ మొదటి భాగంలోని పాత్రలను కొనసాగిస్తుండగా, వీరితో పాటు మిథున్ చక్రవర్తి, ఎస్.జె. సూర్య, విద్యాబాలన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో భాగం కానున్నారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. అన్ని అంచనాలను తలకిందులు చేస్తూ 'జైలర్ 2' చిత్రం 2026 అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



## రా అండ్ రస్టిక్ గా

# ఆశిష్ గాంధీ 'డానీ'.

### అంచనాలు పెంచుతున్న ఫస్ట్ స్ట్రైక్ గ్లింప్స్!




టాలీవుడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించేందుకు మరో రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోంది. ఆశిష్ గాంధీ హీరోగా, కళ్యాణ్‌జీ గోగణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'డానీ'. రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్లపై రిజ్వాన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'ఫస్ట్ స్ట్రైక్' టీజర్ తాజాగా విడుదల కాగా, సినిమాపై అంచనాలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. టీజర్ ఆరంభంలోనే "నువ్వు బీచ్‌కి ఎప్పుడూ ఒంటరిగా వస్తావా?" అని హీరోయిన్ అడిగే ప్రశ్నకు, హీరో చెప్పే బోల్డ్ ఆన్సర్ యూత్ ఆడియెన్స్‌ను ఇన్‌స్టంట్‌గా కనెక్ట్ చేసేలా ఉంది. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో కేవలం రొమాన్స్ మాత్రమే కాకుండా, థ్రిల్ గొలిపే యాక్షన్ సన్నివేశాలకు కూడా పెద్ద పీట వేసినట్లు స్పష్టమవుతోంది. బీచ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్, నటీనటుల గ్లామర్ అప్పీల్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇప్పటికే దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ, హీరో ఆశిష్ గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన 'నాటకం', 'కళింగ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించాయి. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టడానికి 'డానీ'తో వస్తుండటంతో సినీ వర్గాల్లోనూ మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టెక్నికల్ పరంగా కూడా 'డానీ' ఫస్ట్ స్ట్రైక్ అత్యున్నత ప్రమాణాలతో నిలిచింది. ఏకే ఆనంద్ సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, కలర్ ఫుల్‌గా ఉంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా బీజీఎం అదరగొట్టింది. ఖుషి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి మణికాంత్ ఎడిటర్‌గా, రామ్ సుంకర, కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రాఫర్లుగా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను మేకర్స్ విడుదల చేయనున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి అక్టోబర్ నెలలో ఈ సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. రా అండ్ రస్టిక్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ 'డానీ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!

# మగవాళ్ళకి కూడా పీరియడ్స్ రావాలి..

### శ్రుతిహాసన్ సెన్సేషనల్ కామెంట్స్

సినీ ప్రేక్షకులకు పెద్దగా పరిచయం అవసరం లేని పేరు శ్రుతి హాసన్. విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ఆమె.. నటిగా మాత్రమే కాకుండా సింగర్‌గానూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించింది. అయితే తాజాగా శ్రుతి హాసన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పీరియడ్స్ సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని బయటకు చెప్పడానికి తాను పడిన ఇబ్బందుల గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న శ్రు తి హాసన్.. తన వ్యక్తిగత అనుభవాలను ఓపెన్‌గా పంచుకుంది. తనకు ౹ాజూా సమస్య ఉండటంతో పీరియడ్స్ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని తెలిపింది. చిన్నప్పటి నుంచే పీరియడ్స్ తనకు చాలా బాధాకరంగా ఉండేవని చెప్పిన శ్రుతి.. కొన్ని సందర్భాల్లో విపరీతమైన నొప్పితో పాటు వాంతులు చేసుకోవడం, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు కూడా ఎదురయ్యాయని తెలిపింది. కొన్నిసార్లు పరిస్థితి తీవ్రంగా మారడంతో ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేదని తన అనుభవాలను వివరించింది. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ఈ సమస్య తనకు మరింత ఇబ్బందికరంగా మారిందని శ్రుతి హాసన్ చెప్పుకొచ్చింది. ముఖ్యంగా షూటింగ్ సమయంలో యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొనేటప్పుడు కడుపునొప్పి తీవ్రంగా ఉన్నప్పటికీ.. ఆ విషయాన్ని ఎవరికీ చెప్పలేక చాలా ఇబ్బంది పడేదానినని తెలిపింది. తనకు ఏదైనా సమస్య ఉందని చెప్పడం కంటే.. దాన్ని దాచుకోవడమే మంచిదని అప్పట్లో భావించేదానినని చెప్పింది. అయితే అలా తన సమస్యను దాచుకోవడం వల్ల తాను ఎందుకు డల్‌గా, ఎనర్జీ లేకుండా కనిపిస్తున్నాననే విషయం చుట్టుపక్కల వారికి అర్థం కాకపోయేదని పేర్కొంది. అయితే ఒకసారి తనతో కలిసి పనిచేస్తున్న ఓ ఆర్టిస్ట్‌కు సర్జరీ జరగడంతో అతని పరిస్థితిని మేకర్స్‌కు వివరించగా.. వారు అతనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారని శ్రుతి తెలిపింది. అంతేకాదు, అతనికి ఇబ్బంది కలగకుండా షూటింగ్ సమయాలను సైతం మార్చారని చెప్పింది. ఆ సంఘటనను చూసిన తర్వాత తాను కూడా తన సమస్యను మేకర్స్‌కు చెబితే వారు అర్థం చేసుకుంటారనే నమ్మకం కలిగిందని తెలిపింది. ఆ తర్వాత ఓ దర్శకుడికి తన పీరియడ్స్ సమస్య గురించి చెప్పానని, ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని చెప్పుకొచ్చింది. ఆ దర్శకుడికి కూడా కుమార్తె ఉండటంతో తనకు మరింత ధైర్యం వచ్చిందని వెల్లడించింది. అప్పటి నుంచి తన సమస్యను దాచుకోకుండా అవసరమైనప్పుడు ఓపెన్‌గా చెప్పడం ప్రారంభించానని శ్రుతి హాసన్ పేర్కొంది. ఇదే సందర్భంలో శ్రుతి హాసన్ మగవాళ్లపై సరదాగా సెటైరికల్ కామెంట్ చేసింది. మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని ఆమె వ్యాఖ్యానించింది. అలా జరిగితే హీరోయిన్లతో కుదుర్చుకునే కాంట్రాక్టుల్లో పీరియడ్స్ విషయాన్ని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించి.. వారికి హాలిడేస్ ఇచ్చేవారేమో అంటూ సరదాగా చెప్పింది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# అనుకున్న సమయానికి కష్టమేనా?



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ వార్ డ్రామా 'ఫౌజీ' చిత్రాన్ని డిసెంబర్ 3న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజా పరిణామాలను గమనిస్తే ఈ ఏడాది 'ఫౌజీ' విడుదల అసాధ్యమనే టాక్ వినిపిస్తున్నది. బ్యాలెన్స్‌గా ఉన్న వర్క్ కారణంగా ఈ సినిమా డిసెంబర్ బరి నుంచి తప్పుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన రెండు భారీ యాక్షన్ ఘట్టాలను తెరకెక్కించాల్సి ఉంది. వీటికి 40రోజుల కాల్‌షీట్లు అవసరమని చెబుతున్నారు. దీనితో పాటు కొంత ప్యాచ్ వర్క్ కూడా మిగిలి ఉండటంతో మొత్తంగా 50రోజులకుపైగా షూటింగ్ అవసరం ఉంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 3న 'ఫౌజీ' రిలీజ్ కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఏడాది రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న ఈ సినిమా ప్రేక్షకులముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అయితే ఇవి కేవలం ఊహాగానాలేనని, ముందస్తు ప్రకటించిన తేదీనే సినిమా విడుదలవుతుందని ఫ్యాన్స్ ధీమాగా ఉన్నారు. ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ఇమాన్వి, మిథున్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణం: మైత్రీ మూవీ మేకర్స్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, భూషణ్ కుమార్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.